


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు

సెల్ : 9182 474 575

www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA

RNI No: TELTEL/2024/86684

## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575

| మేడ్చల్-మల్కాజ్ గిరి | సోమవారం | 10.08.2026 | సంపుటి: 3 | సంచిక: 188 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | MONDAY | 10.08.2026 | VOLUME : 3 | ISSUE : 188 | PAGES: 8 | COST: 2/- |

# భాగ్యనగరం బోనమెత్తింది..

సింహవాహిని అమ్మవారి సన్నిధిలో ఆధ్యాత్మిక సందడి.. ప్రభుత్వ తరపున పట్టువస్త్రాల సమర్పణ

## లాల్‌దర్వాజాకు పోటెత్తిన భక్తజనం



- తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- మంత్రులు, ప్రజాప్రతినిధులు, సినీ ప్రముఖుల అమ్మవారి దర్శనం
- భక్తుల కోసం ఆరు క్యూలైన్లు.. ప్రత్యేక దర్శన ఏర్పాట్లు
- ఐదు లక్షల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం
- 2,500 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు

**హైదరాబాద్, ఆగస్టు 9:**

ఆషాఢ బోనాల పండుగతో భాగ్యనగరం భక్తి భావంతో మురిసిపోయింది. ఓల్డ్‌సిటీలోని లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయంతో పాటు నగరంలోని ప్రధాన దేవాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. తెల్లవారుజామున 4.30 గంటల నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్వాహకుల తరపున అమ్మవారికి తొలిబోనం సమర్పించారు. బోనం, ఒడిబియ్యం, చీర, సారె సమర్పించేందుకు పెద్ద సంఖ్యలో మహిళలు తరలిరావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి.

**అమ్మవారి సేవలో మంత్రులు**

లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారి ఆలయాన్ని బోనాల జాతర సందర్భంగా సర్వాంగ సుందరంగా అలంకరించారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మంత్రి శ్రీధర్‌బాబు అక్కన్న మాదన్న మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. కలెక్టర్ ప్రియాంక ఆలయానికి చేరుకుని అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు. ఉదయం నుంచి రాత్రి 10.30 గంటల వరకు భక్తుల బోనాలు, ఒడిబియ్యం,

మిగతా 2వ పేజీలో..



# బండికి దారివ్వండి

- తెలంగాణపై బీజేపీ ఫోకస్
- రాష్ట్ర నాయకత్వ మార్పుపై ఊహాగానాలు
- నేతల మధ్య విభేదాలకు చెక్..
- బండి సంజయ్‌కు మరోసారి పగ్గాలపై పార్టీలో చర్చ
- అంతర్గత విభేదాల పరిష్కారానికి అధిష్ఠానం ప్రత్యేక దృష్టి
- ఎంపీల మధ్య సమన్వయం కోసం వరుస సమావేశాలు
- బీసీ సామాజిక సమీకరణాలపైనా బీజేపీ వ్యూహం
- దసరా నాటికి నాయకత్వ మార్పుపై స్పష్టత వచ్చే అవకాశం



**హైదరాబాద్, ఆగస్టు 9:**

తెలంగాణలో అధికారమే లక్ష్యంగా బీజేపీ జాతీయ నాయకత్వం రాష్ట్ర పార్టీలో కీలక మార్పులకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. బెంగాల్ ఎన్నికల అనంతరం తెలంగాణపై ప్రత్యేక దృష్టి పెట్టిన సంఘ్, రాష్ట్ర బీజేపీలో కొంతకాలంగా కొనసాగుతున్న అంతర్గత విభేదాలపై అధిష్ఠానానికి స్పష్టమైన

మిగతా 3వ పేజీలో..



## క్విట్ ఇండియా స్ఫూర్తితో ప్రజాస్వామ్య పరిరక్షణ

- గాంధీభవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ.. స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళి
- జాతీయ జెండాను ఆవిష్కరించిన కాంగ్రెస్ నేతలు
- స్వాతంత్ర్య పోరాట చరిత్రపై ప్రత్యేక ప్రదర్శన
- అరుదైన చిత్రాలు, చారిత్రక పత్రాలను పరిశీలించిన నాయకులు
- రాజ్యాంగ విలువలను కాపాడటమే నిజమైన నివాళి
- భారీగా పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

3



## కొమరం భీమ్ స్ఫూర్తితో ఆదివాసీ హక్కుల పరిరక్షణ

- ఆదివాసీ హక్కులు, ఆత్మగౌరవానికి ప్రభుత్వం కట్టుబాటు
- అడవి, భూమి హక్కులతో పాటు విద్య, ఉపాధికి ప్రాధాన్యం
- అశ్వారావుపేటలో రూ.1,200 కోట్ల అభివృద్ధి పనులు
- గిరిజన చరిత్రను భావితరాలకు చేరేలా కార్యక్రమాలు
- యువత విద్య, నైపుణ్యాలపై దృష్టి సారించాలని పిలుపు

**అశ్వారావుపేట, ఆగస్టు 10:**

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అశ్వారావుపేటలో ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో కొమరం భీమ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మంత్రి సీతక్క, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ఆదివాసీలు కొమరం భీమ్ పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు.

**హక్కులు, ఆత్మగౌరవమే కొమరం భీమ్ వారసత్వం**

కొమరం భీమ్

మిగతా 2వ పేజీలో..

## ప్రాజెక్టులకు భారీగా వరద ప్రవాహం



- ఆల్మట్టికి 1,05,332 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

3

## పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ అండ.. రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం

- నల్లబెల్లిలో కుటుంబ సభ్యులను పరామర్శించిన కేసీఆర్.. పెద్ది సేవలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగం
- పెద్ది చిత్రపటానికి నివాళులర్పించిన బీఆర్ఎస్ అధినేత
- ఇద్దరు పిల్లలకు చెరో రూ.1 కోటి చొప్పున కేటాయింపు
- తల్లి అమృతమ్మ పేరిట రూ.25 లక్షలు బ్యాంకులో జమ
- కుటుంబ భవిష్యత్‌కు పార్టీ అండగా ఉంటుందని హామీ
- దశదినకర్మ అనంతరం మరిన్ని సహాయక చర్యలపై నిర్ణయం

3





## నాటి పోలీసు అమరుల త్యాగాలే నేటి శాంతికి నిదర్శనం

- వరంగల్‌లో అమరుల కుటుంబాలతో డీజీపీ సీ వీ ఆనంద్ భేటీ
- 'టీజీ-వీర్' యాప్ ప్రారంభం

2

### సైబర్ నేరాలే కొత్త సవాల్.. పోలీసింగ్‌లో అప్రమత్తత తప్పదు

- ఫిర్యాదుల పరిష్కారంలో వేగం పెంచాలని అధికారులకు సూచన

2

## మ్యాట్రిమోని పరిచయం.. రూ.45 లక్షల సైబర్ మోసం

- హైదరాబాద్‌కు చెందిన 39 ఏళ్ల ప్రైవేటు ఉద్యోగికి టోకరా
- ముంబయికి చెందిన మహిళగా పరిచయం చేసుకున్న యువతి
- రూ.7,500తో మొదలై రూ.45 లక్షలకు చేరిన పెట్టుబడి
- లాభాల ఉపసంహరణకు 30 శాతం పన్ను చెల్లించాలని డిమాండ్
- మల్కాజిగిరి సైబర్ క్రైమ్ పోలీసుల దర్యాప్తు

2





## స్వచ్ఛ ఇంధన హబ్‌గా తెలంగాణ

- యూసీ బర్క్లీలో భట్టి విక్రమార్క కీలక భేటీ
- భవిష్యత్ ఇంధన అవసరాలు, గ్రీన్ టెక్నాలజీపై విస్తృత చర్చ
- 2030 నాటికి 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ సామర్థ్యంపై వ్యూహాలు
- గ్రిడ్ ఆధునీకరణ, బ్యాటరీ నిల్వ వ్యవస్థలపై పరిశోధకులతో చర్చ

2

## అప్రమత్తంగా ఉండండి..

- ఎల్లో అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ
- పలు జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం..
- గంటకు 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు
- 24 గంటల్లో తెలంగాణలో పలు ప్రాంతాల్లో వర్షాలు
- హైదరాబాద్ సహా నాలుగు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు
- ఆరు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో భారీ వర్ష సూచన

3

# మ్యాట్రిమోని పరిచయం.. రూ.45 లక్షల సైబర్ మోసం

**హైదరాబాద్, ఆగస్టు 10:**

పెళ్లి చేసుకోవాలనే ఉద్దేశంతో మ్యాట్రిమోని వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్న ఓ ప్రైవేటు ఉద్యోగికి ఆన్‌లైన్ పరిచయం భారీ ఆర్థిక నష్టాన్ని మిగిల్చింది. వివాహం చేసుకుంటానంటూ పరిచయమైన ఓ మహిళ.. డ్రాప్‌షిప్పింగ్, పెట్టుబడుల్లో భారీ లాభాలు వస్తాయని నమ్మించి దశలవారీగా రూ.45 లక్షలు పెట్టుబడి పెట్టించింది. చివరకు నగదు తిరిగి తీసుకునే ప్రయత్నం చేయగా 30 శాతం పన్ను చెల్లించాలని చెప్పి, అనంతరం ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి అతడిని సంప్రదించకుండా తప్పించుకుంది.

**మ్యాట్రిమోని వేదికగా పరిచయం**

ఎఫ్ఐఆర్ వివరాల ప్రకారం హైదరాబాద్ హయత్‌నగర్ ప్రాంతానికి చెందిన 39 ఏళ్ల ప్రైవేటు ఉద్యోగి వివాహం చేసుకునేందుకు పేరొందిన మ్యాట్రిమోని వెబ్‌సైట్‌లో తన ప్రొఫైల్‌ను నమోదు చేసుకున్నారు. ఈ ప్రొఫైల్‌ను చూసిన ముంబయికి చెందిన మహిళ ప్రీతి గుప్తా (28) పేరుతో ఫోన్ చేసి పరిచయం చేసుకుంది. అనంతరం వాట్సాప్‌కు చెందిన రెండు నంబర్లు, టెలిగ్రామ్‌కు మరో నంబర్ ఇచ్చి వాటి ద్వారా తరచూ మాట్లాడేది.

మూడు నెలలపాటు ఇద్దరి మధ్య వాట్సాప్ కాల్స్, వీడియో కాల్స్, చాటింగ్ కొనసాగింది. క్రమంగా ఆమెపై నమ్మకం పెరగడంతో తన ఆర్థిక వ్యవహారాల గురించి కూడా ఉద్యోగి ఆమె చెప్పిన మాటలను విశ్వసించినట్లు పోలీసులు తెలిపారు.

**రూ.7,500 నుంచి రూ.45 లక్షలకు**

భవిష్యత్ కోసం తాను నిర్వహిస్తున్న డ్రాప్‌షిప్పింగ్, పెట్టుబడి వ్యాపారంలో నగదు పెడితే అధిక లాభాలు పొందవచ్చని మహిళ అతడిని నమ్మించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తొలుత రూ.7,500 పెట్టుబడితో ప్రారంభించిన ఉద్యోగి.. ఆమె సూచనల మేరకు దశలవారీగా సుమారు రూ.45 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు.

డ్రాప్‌షిప్పింగ్ యాప్‌లో తనకు కేటాయించిన ఖాతాలో లాభాలు వచ్చినట్లు కనిపించడంతో అతడి నమ్మకం మరింత పెరిగింది. అయితే ఆ మొత్తాన్ని ఉపసంహరించుకునే ప్రయత్నం చేయగా 30 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుందని మహిళ చెప్పినట్లు పోలీసులు తెలిపారు.

**ఫోన్లు స్విచ్ఛాఫ్.. బ్లాక్**

పన్ను చెల్లింపు తదితర కారణాలతో ఉద్యోగిని మరింతగా డబ్బు చెల్లించేలా ఒత్తిడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం మహిళ తన ఫోన్లన్నింటినీ స్విచ్ఛాఫ్ చేసింది. మరో ఫోన్ నంబర్ ద్వారా ఆమెను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆ నంబర్‌ను కూడా బ్లాక్ చేసినట్లు బాధితుడు పోలీసులకు తెలిపాడు.

దీంతో తాను సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించిన ప్రైవేటు ఉద్యోగి మల్కాజిగిరి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు.. మహిళ ఉపయోగించిన ఫోన్ నంబర్లు, పెట్టుబడుల లావాదేవీలు, డిజిటల్ ఖాతాల ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# కొమరం భీమ్ స్ఫూర్తితో ఆదివాసీ హక్కుల పరిరక్షణ

**మొదటిపేజీ తరువాయి**

ఆశయాలు నేటికీ ఆదివాసీ సమాజానికి మార్గనిర్దేశం చేస్తున్నాయని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వాన్ని కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అడవి, భూమి హక్కులతో పాటు విద్య, ఉపాధి, గృహాలు, మౌలిక సదుపాయాలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆదివాసీ భాషలు, సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు, జీవన విధానాన్ని పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. యువత విద్యను కొనసాగించడంతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**నియోజకవర్గంలో రూ.1,200 కోట్ల పనులు**

అశ్వారావుపేట నియోజకవర్గంలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో సుమారు రూ.1,200 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు సీతక్క వెల్లడించారు. రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, గృహ నిర్మాణ రంగాల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. ప్రాంత సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కృషి చేస్తోందని తెలిపారు.

**గిరిజన చరిత్రను భావితరాలకు**

ఆదివాసీ సమాజంలో ఐక్యత, చైతన్యం, విద్యాభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. కొమరం భీమ్ అర్బన్ పార్కులో గిరిజన మ్యూజియం, గిరిజన విద్యా వికాస భవనం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. ఆదివాసీ చరిత్ర, సంస్కృతి, పోరాట వారసత్వాన్ని భావితరాలకు చేరవేయాల్సిన అవసరం ఉందన్నారు.

**వీరుల గాథలను యువతకు పరిచయం**

కొమరం భీమ్, రాంజీ గోండు, సమ్మక్కసారలమ్మ వంటి ఆదివాసీ వీరుల పోరాట చరిత్రను యువతకు పరిచయం చేసే కార్యక్రమాలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతుల రంగాల్లో ఆదివాసీల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో విద్యా చందన, జెడ్పీ సీఈవో నాగలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు, ఆదివాసీ జేఏసీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో ఆదివాసీ ప్రజలు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఇంధన హబ్‌గా తెలంగాణ

**కాలిఫోర్నియా, ఆగస్టు 10:**

తెలంగాణను స్వచ్ఛ ఇంధన రంగంలో ప్రపంచస్థాయి కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. అమెరికా పర్యటనలో భాగంగా యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్క్లీలోని గోల్డ్‌మన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ పరిధిలో పనిచేస్తున్న 'ఇండియా ఎనర్జీ అండ్ క్లైమేట్ సెంటర్'ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పరిశోధకులు, నిపుణులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో భారత పునరుత్పాదక ఇంధన లక్ష్యాలు, తెలంగాణ భవిష్యత్ ఇంధన ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు.

**500 గిగావాట్ల లక్ష్యంపై వ్యూహాలు**

2030 నాటికి దేశంలో 500 గిగావాట్ల నాన్‌ఫాసిల్ ఇంధన సామర్థ్యాన్ని సాధించేందుకు అవసరమైన కార్యాచరణపై సమావేశంలో చర్చ జరిగింది. శుద్ధ ఇంధన సాంకేతికతల వ్యయం తగ్గుతున్న నేపథ్యంలో ఏర్పడుతున్న కొత్త అవకాశాలను పరిశీలించారు. గ్రిడ్ ఆధునీకరణ, పారిశ్రామిక డీకార్బనైజేషన్, ఆధునిక బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థల అనుసంధానం, సమాన అవకాశాలతో కూడిన శక్తి పరివర్తన వంటి అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు.

**గ్రామీణ ప్రాంతాల్లో సోలార్ నమూనా**

తెలంగాణలో అమలు చేస్తున్న పునరుత్పాదక ఇంధన విధానాలను భట్టి విక్రమార్క వివరించారు. పారదర్శకమైన హరిత విధానాలతో పెట్టుబడులను ఆకర్షిస్తూ సౌరశక్తితో పాటు ఇతర పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని విస్తరిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో సోలార్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్న విధానాన్ని వివరించారు. పీఎంకుసుమ్ పథకం ద్వారా రైతులకు స్వచ్ఛ ఇంధనాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రజాకేంద్రిత విధానాలపై అంతర్జాతీయ ప్రతినిధులు ప్రశంసలు వ్యక్తం చేశారు.

**క్లీన్‌టెక్ తయారీకి ప్రోత్సాహం**

రాష్ట్రంలో 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు క్లీన్‌టెక్ పరికరాల తయారీ రంగాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సిలికాన్ వ్యాలీ ఆవిష్కరణలు, కాలిఫోర్నియా ఇంధన రంగంలో అనుసరిస్తున్న విధానాలను తెలంగాణ అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవడంపై చర్చించారు.

**యూసీ బర్క్లీతో సంయుక్త అధ్యయనాలు**

విద్యుత్, రవాణా, పారిశ్రామిక రంగాలతో పాటు వాతావరణ స్థిరత్వంపై తెలంగాణ, యూసీ బర్క్లీ కలిసి అధ్యయనాలు చేపట్టే అంశాన్ని సమావేశంలో ప్రస్తావించారు. విధాన నిర్ణేతలకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా రాష్ట్ర ఇంధన భద్రతను, ఆర్థిక పోటీతత్వాన్ని మరింత పెంచేందుకు సహకారం అందించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. రాష్ట్రంలో భవిష్యత్ ఇంధన అవసరాలకు అనుగుణంగా సరికొత్త విధానాలను రూపొందించేందుకు అంతర్జాతీయ అనుభవాలను వినియోగించుకోవాలని భేటీలో నిర్ణయించారు.

# నాటి పోలీసు అమరుల త్యాగాలే నేటి శాంతికి నిదర్శనం

**హైదరాబాద్**

పోలీసు అమరుల త్యాగాల ఫలితంగానే నేడు రాష్ట్రంలో శాంతిభద్రతలు నెలకొన్నాయని తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో విధి నిర్వహణలో నక్సలైట్లతో పోరాడుతూ అమరులైన 28 మంది పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులతో ఆయన ఆత్మీయంగా సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా అమరుల కుటుంబాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'టీజీవీర్' గ్రీవెన్స్ పోర్టల్‌ను డీజీపీ ప్రారంభించారు. ఎక్స్‌గ్రేషియా, ఆర్థిక సాయం, కారుణ్య నియామకాలు, స్థలాల కేటాయింపు, సంక్షేమ పథకాల వంటి అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను ఒకే వేదికపై నమోదు చేసుకునేలా ఈ పోర్టల్‌ను రూపొందించారు. అమరుల సేవా వివరాలు, కుటుంబ సమాచారం, ఇప్పటివరకు పొందిన ప్రయోజనాలు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు కూడా ఇందులో అందుబాటులో ఉంటాయని తెలిపారు. రాష్ట్ర, యూనిట్ స్థాయిలో అధికారులు ఫిర్యాదుల పరిష్కారాన్ని పర్యవేక్షించే అవకాశం కల్పించారు. అమరుల కుటుంబాలకు క్యూ ఆర్ కోడ్‌తో కూడిన ప్రత్యేక ఫ్యామిలీ కార్డులను డీజీపీ అందజేశారు. ఆ క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే నేరుగా టీజీవీర్ పోర్టల్‌కు చేరుకునేలా ఏర్పాటు చేశారు. ఈ పోర్టల్‌ను రూపొందించిన ఎస్ఐబీ అధికారులను అభినందించిన ఆయన, రాష్ట్రంలోని అన్ని యూనిట్ల నుంచి అమరుల కుటుంబాల సమస్యలను సేకరించి సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో అమరుల కుటుంబాలు ఎక్స్‌గ్రేషియా, ఆర్థిక సాయం, స్థలాల కేటాయింపు, రిజిస్ట్రేషన్, పెన్షన్, ఇతర సంక్షేమ అంశాలకు సంబంధించిన ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను డీజీపీ దృష్టికి తీసుకొచ్చాయి. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అలాగే వాటి పరిష్కారాన్ని వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని వరంగల్ పోలీసు కమిషనర్‌కు సూచించారు. తన ఉద్యోగ జీవితాన్ని వరంగల్‌లోనే ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేసుకున్న డీజీపీ, నక్సలైట్ల ప్రభావం తీవ్రంగా ఉన్న రోజుల్లో పోలీసు సిబ్బంది ఎన్నో ప్రాణత్యాగాలు చేశారని చెప్పారు. అప్పటి త్యాగాల వల్లే నేడు ఈ ప్రాంతంలో శాంతియుత వాతావరణం నెలకొన్నదని పేర్కొన్నారు. అనంతరం డీజీపీ నిర్మాణంలో ఉన్న వరంగల్ పోలీసు కమిషనరేట్ నూతన కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. నిర్మాణ పురోగతిని కమిషనర్ వివరించారు. ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందేలా, ఆధునిక సాంకేతికత, నిఘా వ్యవస్థలకు అనుకూలంగా భవనాన్ని తీర్చిదిద్దాలని డీజీపీ సూచించారు. వినియోగంలో లేని పాత భవనాలను తొలగించి, కార్యాలయానికి వెళ్లే అంతర్గత రహదారులను మెరుగుపరచాలని ఆదేశించారు






# సైబర్ నేరాలే కొత్త సవాల్.. పోలీసింగ్‌లో అప్రమత్తత తప్పదు

- **నక్సలిజం నుంచి సైబర్ నేరాల దిశగా మారిన సవాళ్లు.. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌పై డీజీపీ సమీక్ష**
- **ఫిర్యాదుల పరిష్కారంలో వేగం పెంచాలని అధికారులకు సూచన**
- **ఏడాదిలో సైబర్ మోసాలతో రూ.1,700 కోట్ల నష్టం**
- **చిన్నారులను టార్గెట్ చేస్తున్న డ్రగ్స్ ముఠాలపై కఠిన చర్యలు**
- **3,758 పోస్టుల్లో 782 ఖాళీలు.. కమిషనరేట్‌లో 50 స్టేషన్లు**
- **సాంకేతికతతోపాటు మౌలిక పోలీసింగ్‌కు ప్రాధాన్యం**

**వరంగల్, ఆగస్టు 9:**

ఒకప్పుడు నక్సలిజం పోలీసులకు అతిపెద్ద సవాల్‌గా ఉండగా, ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వ్యాప్తి, ఆర్థిక మోసాలు, రోడ్డు భద్రత ప్రధాన సవాళ్లుగా మారాయని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ తెలిపారు. ఆదివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పనితీరును సమీక్షించిన ఆయన.. సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్నప్పటికీ ప్రాథమిక పోలీసింగ్ విధానాలను విస్మరించరాదని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలకు తక్షణ స్పందన, ఫిర్యాదుల సకాల పరిష్కారమే పోలీసుల ప్రాథమిక బాధ్యతగా పేర్కొన్నారు.

**సాంకేతికతకు అనుగుణంగా దర్యాప్తు**

ఎన్ఐటీలో జరిగిన సమీక్ష సమావేశంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, టీస్పార్క్, సీఐడీ అధికారులు సైబర్ నేరాల తాజా ధోరణులు, దర్యాప్తు పద్ధతులు, అందుబాటులోకి వచ్చిన సాంకేతిక వ్యవస్థలపై ప్రజెంటేషన్లు ఇచ్చారు. ఆధునిక సాంకేతికతను సమర్థంగా వినియోగించుకుంటూనే క్షేత్రస్థాయిలో పోలీసింగ్ బలోపేతం చేయాలని డీజీపీ సూచించారు.

తన పోలీసు ప్రస్థానానికి వరంగల్‌తో విడదీయరాని అనుబంధం ఉందని సి.వి. ఆనంద్ గుర్తు చేసుకున్నారు. జిల్లాలో శిక్షణతో తన పోలీసు సేవలు ప్రారంభమయ్యాయని, అనంతరం వరంగల్ రూరల్ ఎస్పీగా పనిచేసిన కాలం తనకు ప్రత్యేకమైనదని తెలిపారు. నక్సలిజం ప్రభావం తీవ్రంగా ఉన్న సమయంలో ల్యాండ్‌మైన్ పేలుళ్లు, దాడుల మధ్య పోలీసులు విధులు నిర్వర్తించారని చెప్పారు. ప్రస్తుతం తెలంగాణలో నెలకొన్న శాంతిభద్రతల పరిస్థితి పోలీసు అమరుల త్యాగాల ఫలితమని పేర్కొన్నారు.

**రూ.1,700 కోట్ల సైబర్ మోసాలు**

గత ఏడాది తెలంగాణలో సైబర్ నేరగాళ్ల చేతిలో ప్రజలు సుమారు రూ.1,700 కోట్లు నష్టపోయారని డీజీపీ వెల్లడించారు. మోసానికి గురైన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేస్తే నగదు రికవరీకి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. ముఖ్యంగా అధిక లాభాల ఆశ చూపుతూ జరిగే పెట్టుబడి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సైబర్ నేరాల నియంత్రణ, దర్యాప్తులో తెలంగాణ దేశంలోనే తొలి స్థానంలో నిలవడం గర్వకారణమని డీజీపీ పేర్కొన్నారు. సైబర్ నేరాల స్వభావం వేగంగా మారుతున్న నేపథ్యంలో పోలీసులు కూడా అదే స్థాయిలో తమ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు.

**చిన్నారులపై డ్రగ్స్ ముప్పు**

చిన్నారులను ఆకర్షించేందుకు చాక్లెట్ల రూపంలో మాదకద్రవ్యాలను చేరవేసే ప్రయత్నాలు ఆందోళన కలిగిస్తున్నాయని డీజీపీ అన్నారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రగ్స్ నియంత్రణ ఒక్క పోలీసు శాఖతో సాధ్యం కాదని, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, పోలీసులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.

**అంతర్రాష్ట్ర ముఠాలపై నిఘా**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 50 పోలీస్ స్టేషన్లు ఉన్నాయని కమిషనర్ సమీక్ష సందర్భంగా వెల్లడించారు. మొత్తం 3,758 మంజూరైన పోస్టులకు గాను 782 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. బీహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి వచ్చి చైన్‌స్నాచింగ్, బైక్ చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని వివరించారు.

ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు చేపట్టిన 'నేను సైతం' కార్యక్రమాన్ని డీజీపీ అభినందించారు. ప్రజల సహకారాన్ని మరింత విస్తృతం చేసుకుని సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానం, ప్రజల భాగస్వామ్యం, సమర్థవంతమైన మౌలిక పోలీసింగ్‌ను సమన్వయం చేస్తే ప్రజల భద్రతను మరింత పటిష్ఠం చేయవచ్చని సూచించారు.





# భాగ్యనగరం బోనమెత్తింది..

**మొదటిపేజీ తరువాయి**

చీర, సారె సమర్పణలు కొనసాగనున్నాయి. సాయంత్రం అమ్మవారి శాంతి కల్యాణం నిర్వహించనున్నారు.

**ప్రముఖుల సందడి**

లాల్‌దర్వాజా అమ్మవారిని పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు దర్శించుకున్నారు. మంత్రి సీతక్క, ఎంపీ అనిల్ యాదవ్, బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, సినీ నటులు విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా, గాయని మంగ్లీ తదితరులు అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందించారు.

సినీ నటుడు విజయ్ దేవరకొండ తొలిసారిగా అమ్మవారిని దర్శించుకున్నట్టు తెలిపారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్రొడక్షన్స్ హౌస్‌కు భద్రకాళి అనే పేరు పెట్టుకున్నారని, ఆయనతో పాటు ఆనంద్‌తో కలిసి ఆలయానికి వచ్చినట్టు చెప్పారు. తనతో పాటు అందరి కోరికలు నెరవేరాలని అమ్మవారిని ప్రార్థించినట్టు పేర్కొంటూ ప్రజలకు బోనాల శుభాకాంక్షలు తెలిపారు.

**భక్తులకు సౌకర్యాల కల్పన**

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ ప్రాంగణంలో ఆరు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. బోనం తీసుకొచ్చే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. వీఐపీలు, సాధారణ భక్తులకు దర్శనం విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. అత్యవసర పరిస్థితుల కోసం అంబులెన్స్‌లు, వైద్య శిబిరాలు అందుబాటులో ఉంచారు. జోగినీలు ముందస్తుగా సమాచారం ఇస్తే వారికి ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేశారు. సోమవారం రంగం భవిష్యవాణి, పోతురాజుల విన్యాసాలు, భవానీ రథయాత్ర నిర్వహించనున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు సంతోషంగా ఉండాలని కోరుతూ అమ్మవారికి బోనం సమర్పించినట్టు మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఆలయాల అభివృద్ధికి రూ.20 కోట్ల నిధులు కేటాయించినట్టు చెప్పారు. జోగినీలు నేరుగా బోనం తీసుకువెళ్లి అమ్మవారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేశామని, వేడుకలు ఎలాంటి ఆటంకాలు లేకుండా జరిగేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.



**ఐదు లక్షల మంది రాకపై అంచనా**

ఆషాఢమాసంలో ప్రతి ఏడాది జరిగే బోనాల జాతరకు సింహవాహిని అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షలాది మంది భక్తులు తరలి వస్తారు. ఈసారి దాదాపు ఐదు లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా 8 దేవాలయాలతో పాటు లాల్‌దర్వాజా పరిధిలోని సుమారు మూడు వేల చిన్న దేవాలయాల్లోనూ అమ్మవారికి బోనాలు సమర్పించారు.

భారీ రద్దీ నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఆలయ పరిసరాలు, రద్దీ ప్రాంతాలను 100 సీసీటీవీ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నారు. భక్తుల భద్రత కోసం 2,500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. పండుగ వేడుకలు ప్రశాంతంగా కొనసాగేందుకు అధికారులు నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

# నాన్న చేతిలోనే నలిగిన బాల్యం..

**హైదరాబాద్, ఆగస్టు 9:**

హైదరాబాద్‌లో నాలుగేళ్ల బాలుడు అర్మాన్‌పై తండ్రి సల్మాన్ చేసిన దాడి విషాదాంతమైంది. కుటుంబ విభేదాల నేపథ్యంలో ఆగస్టు 5న బాలుడిపై దాడికి పాల్పడిన సల్మాన్.. పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నంబర్ 104 సమీపంలో చిన్నారి తలను పిల్లర్‌కు బలంగా కొట్టడంతో పాటు పైకి ఎత్తి నేలపై పడేసినట్లు పోలీసులు తెలిపారు. అంతటితో ఆగకుండా బాలుడిని వెళ్తున్న లారీ కిందకు నెట్టేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. స్థానికులు వెంటనే స్పందించి బాలుడిని కాపాడి, సల్మాన్‌ను పట్టుకుని గుడిమల్కాపూర్ పోలీసులకు అప్పగించారు.

**ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడి..**

తీవ్రంగా గాయపడిన అర్మాన్‌ను నిలోఫర్ చిన్నపిల్లల ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఆగస్టు 5 నుంచి వైద్యుల పర్యవేక్షణలో ఉన్న బాలుడి పరిస్థితి విషమించడంతో ఆదివారం ఉదయం సుమారు 11 గంటలకు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు వైద్యులు తెలిపారు. చిన్నారి మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది.

**కఠిన శిక్ష విధించాలని డిమాండ్**

అర్మాన్ మృతిపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుడు సల్మాన్‌కు ఎవరూ మద్దతు ఇవ్వడం లేదని అతని సోదరుడు తెలిపారు. సల్మాన్ తరచూ మాదకద్రవ్యాలు, నిద్రమాత్రలు, మద్యం సేవిస్తూ కుటుంబానికి సమస్యగా మారాడని ఆరోపించారు. పెళ్లి తర్వాత అతడి ప్రవర్తనతో కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు.

**పోలీసుల దర్యాప్తు వేగవంతం**

చిన్నారి మృతి నేపథ్యంలో కేసును పోలీసులు మరింత తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఇప్పటికే అదుపులో ఉన్న సల్మాన్‌పై చట్టపరమైన చర్యలను కొనసాగిస్తున్నారు. బాలుడిపై దాడికి దారితీసిన పరిస్థితులు, నిందితుడి ప్రవర్తన, ఘటనకు సంబంధించిన ఇతర అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# 'బండి'కి దారివ్వండి

మొదటిపేజీ తరువాయి

సూచనలు చేసినట్టు సమాచారం. ముందుగా నేతల మధ్య సమన్వయం సాధించి, ఆ తర్వాత ఎన్నికల సమరానికి పార్టీని సిద్ధం చేయాలన్న వ్యూహంతో అడుగులు పడుతున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో రాష్ట్ర అధ్యక్ష పదవికి కేంద్ర మంత్రి బండి సంజయ్ పేరు మరోసారి బలంగా వినిపిస్తోంది.

**విభేదాలపై ఢిల్లీ పెద్దల దృష్టి**

రాష్ట్రంలో పార్టీకి అనుకూల రాజకీయ వాతావరణం ఉన్నప్పటికీ నేతల మధ్య ఆధిపత్య పోరే బలహీనతగా మారిందన్న అంచనాకు బీజేపీ పెద్దలు వచ్చినట్టు సమాచారం. గత రెండేళ్ల పరిణామాలను సంఘ్ నాయకత్వం నిశితంగా పరిశీలించినట్టు తెలుస్తోంది. పాత, కొత్త నేతల మధ్య ఉన్న విభేదాలను ముందుగా పరిష్కరించకపోతే ఎన్నికల సమయంలో పార్టీకి నష్టం తప్పదన్న అభిప్రాయాన్ని జాతీయ నాయకత్వం ముందు ఉంచినట్టు సమాచారం. దీంతో సంస్థాగతంగా ఉన్న సమస్యలకు పరిష్కారం కనుగొనే ప్రక్రియ మొదలైనట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఎంపీలకు ఐక్యతా సందేశం

రాష్ట్రానికి చెందిన ఎంపీలను ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు అధిష్టానం వరుస భేటీలు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. లంచ్ సమావేశాలు, టిఫిన్ భేటీలతో పరస్పరం మాట్లాడుకునే వాతావరణాన్ని కల్పిస్తున్నట్టు సమాచారం. పార్టీ ప్రయోజనాల కోసం వ్యక్తిగత విభేదాలను పక్కన పెట్టాలని ఢిల్లీ నాయకత్వం స్పష్టం చేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఐక్యత విషయంలో రాజీ పడితే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని నేతలకు గట్టిగానే చెప్పినట్టు సమాచారం. దీంతో ఇంతకాలం దూరంగా ఉన్న నేతల మధ్య సంబంధాలు క్రమంగా మెరుగుపడుతున్నాయన్న చర్చ మొదలైంది.

**మరోసారి సంజయ్ వైపు చూపు**

రాష్ట్ర అధ్యక్ష పదవిలో మార్పు ఉంటుందన్న ఊహాగానాల మధ్య బండి సంజయ్ పేరు తెరపైకి వచ్చింది. పార్టీ అంతర్గతంగా నిర్వహించిన సర్వేలో తెలంగాణలో బీజేపీని మరింత దూకుడుగా నడిపించే నాయకత్వం అవసరమన్న అభిప్రాయం వ్యక్తమైనట్టు ప్రచారం జరుగుతోంది. గతంలో మూడేళ్లపాటు రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన సంజయ్ నేతృత్వంలో జీహెచ్ఎంసీ ఎన్నికలు, దుబ్బాక, హుజురాబాద్ ఉప ఎన్నికల్లో బీజేపీ విజయాలు సాధించింది. మునుగోడులోనూ పార్టీ గట్టి పోటీ ఇచ్చింది. సంజయ్ మాస్ లీడర్‌గా ఎదగడం, రైతుల సమస్యలపై పోరాటాలు చేయడం, అరెస్టులకు సైతం వెరవకపోవడం అప్పట్లో పార్టీకి ప్రజల్లో బలమైన గుర్తింపు తీసుకొచ్చిందన్న అభిప్రాయం జిల్లా స్థాయి నేతల్లో ఉన్నట్టు తెలుస్తోంది. పట్టణాలకు పరిమితమైన పార్టీని గ్రామీణ ప్రాంతాల్లోకి తీసుకెళ్లడంలో ఆయన పాత్ర కీలకమని అధిష్టానం భావిస్తున్నట్టు సమాచారం. బీఆర్ఎస్‌ను వెనక్కినెట్టి కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీని నిలబెట్టాలంటే సంజయ్ వంటి దూకుడైన నాయకత్వం అవసరమన్న వాదన బలపడుతున్నట్టు తెలుస్తోంది.

**సామాజిక సమీకరణాలపైనా లెక్కలు**

తెలంగాణలో బీసీ సామాజిక వర్గానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలన్న ఆలోచనలో బీజేపీ ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో సంజయ్‌కు రాష్ట్ర పార్టీ పగ్గాలు అప్పగించడం ద్వారా రాజకీయంగా, సామాజికంగా ప్రయోజనం ఉంటుందన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో బండి సంజయ్, ఈటల రాజేందర్ మధ్య కనిపించిన విభేదాలు తగ్గుముఖం పట్టినట్టు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎంపీలను ఏకతాటిపైకి తీసుకొచ్చే ప్రయత్నాల్లో భాగంగానే ఇద్దరి మధ్య కూడా సానుకూల వాతావరణం ఏర్పడిందని చెబుతున్నారు.

అయితే ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పదవీకాలం కొనసాగుతున్నందున వెంటనే మార్పు జరిగే అవకాశం లేదన్న మరో వాదన ఉంది. ముందుగా మూడు నెలలపాటు నేతలను క్షేత్రస్థాయిలో పనిచేయించి వారి పనితీరును అంచనా వేసిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవచ్చని తెలుస్తోంది. దసరా నాటికి రాష్ట్ర నాయకత్వంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నది పార్టీ వర్గాల్లో వినిపిస్తున్న అభిప్రాయం.

**సంజయ్ విషయంలో ట్విస్ట్ కూడా..**

ఢిల్లీ నాయకత్వంతో సంజయ్‌కు ఉన్న సంబంధాలు, సంఘ్ ఆశీస్సులు, ఆయనకున్న మాస్ ఇమేజ్ రాష్ట్ర అధ్యక్ష పదవికి అనుకూల అంశాలుగా మారవచ్చన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అయితే ఆయన కుమారుడిపై ఉన్న పోక్సో కేసు పదవికి అడ్డంకిగా మారవచ్చన్న అభిప్రాయం కూడా కొందరు నేతల్లో ఉంది. రాబోయే కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో సంజయ్ మంత్రి పదవికీ ఇబ్బంది రావచ్చన్న ప్రచారం సాగుతోంది. అదే సమయంలో ఈ కేసు వ్యవహారం పార్టీలోని కొందరి కారణంగానే సంక్లిష్టంగా మారిందన్న సమాచారం అధిష్టానం వద్ద ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర అధ్యక్ష పదవిపై తుది నిర్ణయం ఇంకా వెలువడకపోయినా, తెలంగాణలో బీజేపీ తదుపరి రాజకీయ ప్రయాణానికి నాయకత్వ మార్పు కీలక అంశంగా మారింది. నేతల మధ్య విభేదాలను చక్కదిద్దడం, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, సామాజిక సమీకరణాలను అనుకూలంగా మలచడం వంటి అంశాల ఆధారంగానే అధిష్టానం తుది నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

---

# ప్రాజెక్టులకు భారీగా వరద ప్రవాహం

- **కృష్ణా, గోదావరి బేసిన్లలో పెరుగుతున్న ఇన్‌ఫ్లోలు.. శ్రీశైలంలో 178.74 టీఎంసీల నీటి నిల్వ**
- **ఆల్మట్టికి 1,05,332 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో**
- **జూరాలకు 1,59,318 క్యూసెక్కుల వరద ప్రవాహం**
- **శ్రీశైలంలో 178.74 టీఎంసీల నీటి నిల్వ**
- **నాగార్జునసాగర్‌కు 63,215 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో**
- **ధవళేశ్వరం వద్ద 1,84,546 క్యూసెక్కుల ప్రవాహం**



హైదరాబాద్, ఆగస్టు 10:

తెలంగాణలోని ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహాలు క్రమంగా పెరుగుతున్నాయి. కృష్ణా, గోదావరి నదీ బేసిన్లలో ఎగువ ప్రాంతాల నుంచి నీరు వచ్చి చేరుతుండటంతో ఆయా ప్రాజెక్టుల్లో ఇన్‌ఫ్లోలు గణనీయంగా నమోదవుతున్నాయి. కృష్ణా బేసిన్‌లో ఆల్మట్టి, జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలకు భారీగా నీరు చేరుతుండగా.. గోదావరి బేసిన్‌లో శ్రీరాంసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి, ధవళేశ్వరం వద్ద కూడా ప్రవాహాలు కొనసాగుతున్నాయి.

**కృష్ణా బేసిన్‌లో పెరిగిన ప్రవాహాలు**

ఆల్మట్టి ప్రాజెక్టుకు గత 24 గంటల్లో సగటున 1,05,332 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. జూరాల ప్రాజెక్టుకు 1,59,318 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. దీంతో జూరాల నుంచి వివిధ మార్గాల్లో భారీగా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 1,67,520 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. జలాశయంలో ప్రస్తుతం 178.74 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, నీటిమట్టం 878.10 అడుగులకు చేరింది.

**నాగార్జునసాగర్‌కు 63,215 క్యూసెక్కులు**

నాగార్జునసాగర్ జలాశయానికి 63,215 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 145.29 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఎగువ ప్రాజెక్టుల నుంచి కొనసాగుతున్న ప్రవాహాలతో కృష్ణా బేసిన్‌లోని జలాశయాల్లో నీటి లభ్యత మెరుగుపడుతోంది.

**గోదావరి ప్రాజెక్టుల్లోకి నీరు**

గోదావరి బేసిన్‌లోనూ పలు జలాశయాలకు వరద ప్రవాహాలు కొనసాగుతున్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు గత 24 గంటల్లో 17,127 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ప్రాజెక్టులో 41.70 టీఎంసీల నీరు నిల్వ ఉంది. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 4,357 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, జలాశయంలో 16.01 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

**ధవళేశ్వరం వద్ద భారీ ప్రవాహం**

ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం గణనీయంగా కొనసాగుతోంది. గత 24 గంటల్లో 1,84,546 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ఇందులో 1,69,946 క్యూసెక్కుల నీటిని డెల్టా కాలువలకు విడుదల చేస్తున్నారు. మరో 14,600 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి మళ్లిస్తున్నారు. వరద ప్రవాహాల నేపథ్యంలో ప్రాజెక్టుల నీటిమట్టాలు, ఇన్‌ఫ్లోలు, ఔట్‌ఫ్లోలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

---

# అప్రమత్తంగా ఉండండి..

హైదరాబాద్, ఆగస్టు 10:

తెలంగాణలో రాబోయే 24 గంటల్లో పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్‌తో పాటు కామారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, మెదక్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ములుగు, నల్గొండ, నారాయణపేట, సంగారెడ్డి, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయని పేర్కొన్నారు.



**ఉరుములు.. మెరుపులతో వర్షా లు**

భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న జిల్లాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. వాతావరణంలో మార్పుల నేపథ్యంలో ఉరుములు, మెరుపుల తీవ్రత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. అత్యవసరమైతే తప్ప ప్రజలు బహిరంగ ప్రదేశాల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

**40 కి.మీ. వేగంతో గాలులు**

వర్షాలతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గాలుల తీవ్రత కారణంగా చెట్లు, విద్యుత్ స్తంభాల వద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు వాటికి దూరంగా ఉండాలని సూచించారు.

**వాహనదారులు జాగ్రత్త**

వర్షాల సమయంలో రహదారులపై ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు. చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలబడవద్దని హెచ్చరించారు. గాలులు, వర్షాల సమయంలో ప్రయాణాలు చేసేవారు పరిస్థితులను గమనిస్తూ ముందుకు సాగాలని సూచించారు.

**రైతులకు ముందస్తు సూచనలు**

వర్షాల ప్రభావంతో పంటలకు నష్టం వాటిల్లకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది. పంటల రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అధికారులు జారీ చేసే సూచనలను పాటించాలని స్పష్టం చేసింది.

---

# క్విట్ ఇండియా స్ఫూర్తితో ప్రజాస్వామ్య పరిరక్షణ

హైదరాబాద్, ఆగస్టు 9:

క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీభవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకాటి శ్రీహరి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అజారుద్దీన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించారు.

**స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక ఘట్టం**

భారత స్వాతంత్ర్య పోరాటంలో క్విట్ ఇండియా ఉద్యమానికి ప్రత్యేక స్థానం ఉందని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. మహాత్మా గాంధీ ఇచ్చిన పిలుపు దేశ ప్రజల్లో స్వేచ్ఛా ఆకాంక్షను మరింత బలపరిచిందన్నారు. స్వాతంత్ర్యం కోసం అనేక మంది చేసిన త్యాగాలను స్మరించుకుంటూ వారి సేవలను భావితరాలకు పరిచయం చేయాల్సిన బాధ్యత ఉందని తెలిపారు.

**చారిత్రక ప్రదర్శన సందర్శన**

కార్యక్రమం అనంతరం గాంధీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనను కాంగ్రెస్ నేతలు సందర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమానికి సంబంధించిన అరుదైన ఛాయాచిత్రాలు, చారిత్రక పత్రాలు, అప్పటి ఉద్యమ విశేషాలను పరిశీలించారు. ప్రదర్శనను ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, పోరాట స్ఫూర్తి యువతకు చేరేలా ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

**రాజ్యాంగ స్ఫూర్తే నిజమైన నివాళి**

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను అర్పించిన మహనీయుల ఆశయాలను కొనసాగించడమే వారికి ఇచ్చే అసలైన గౌరవమని నేతలు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ సమైక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.

**ఘనంగా పాల్గొన్న శ్రేణులు**

క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వాతంత్ర్య పోరాట చరిత్రను స్మరించుకుంటూ జాతీయ ఉద్యమ విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న సంకల్పాన్ని నేతలు వ్యక్తం చేశారు.

---



# పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ అండ.. రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం

నల్లబెల్లి, ఆగస్టు 9:

తెలంగాణ ఉద్యమ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అండగా నిలిచారు. ఆదివారం నల్లబెల్లిలోని పెద్ది స్వగృహానికి వెళ్లిన కేసీఆర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ముందుగా పెద్ది చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఆయన.. పెద్ది సుదర్శన్‌రెడ్డి సేవలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. కుటుంబ సభ్యులతో మాట్లాడే సమయంలో కంటతడి పెట్టుకున్నారు. పెద్ది మరణం పార్టీకి, తెలంగాణ ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

**పిల్లల భవిష్యత్‌కు రూ.2 కోట్లు**

పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ తరఫున రూ.2.25 కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఆయన ఇద్దరు పిల్లల పేర్లపై చెరో రూ.1 కోటి చొప్పున మొత్తం రూ.2 కోట్లు కేటాయించారు. పెద్ది తల్లి అమృతమ్మ సంక్షేమం కోసం రూ.25 లక్షలను ఆమె పేరుతో బ్యాంకులో జమ చేయనున్నట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. పిల్లల చదువు, భవిష్యత్ అవసరాలు, కుటుంబ సంక్షేమానికి సంబంధించి పార్టీ అన్ని విధాలా సహకరిస్తుందని కేసీఆర్ హామీ ఇచ్చారు. పార్టీ సీనియర్ నాయకులు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించిన అనంతరం ఆర్థిక సాయం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

**మరిన్ని సహాయక చర్యలపై నిర్ణయం**

పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ పూర్తయిన అనంతరం జిల్లా పార్టీ నాయకులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కుటుంబానికి అవసరమైన ఇతర సహాయ కార్యక్రమాలను కూడా ఆ సమావేశంలో ఖరారు చేయనున్నట్లు తెలిపాయి. భవిష్యత్‌లోనూ పెద్ది కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నాయి.

**కేసీఆర్‌కు ఘన స్వాగతం**

కేసీఆర్ నల్లబెల్లి పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయనకు స్వాగతం పలికాయి. మార్గమధ్యంలో పలుచోట్ల కాన్వాయ్‌ను ఆపిన కేసీఆర్ కార్యకర్తలను పలకరించి వారితో మాట్లాడారు. వారికి ధైర్యం చెప్పారు. జై తెలంగాణ, జై కేసీఆర్ నినాదాలతో నల్లబెల్లి పరిసరాలు మార్మోగాయి.

---




# ఆదివాసీల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

- **గిరిజన సంక్షేమానికి రూ.18,745.16 కోట్ల కేటాయింపు.. విద్య, ఉపాధి, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి**
- **166 గిరిజన గురుకులాల్లో 83 వేల మందికిపైగా విద్యార్థులు**
- **కృత్రిమ మేధ, డిజిటల్ విద్యకు మరింత ప్రాధాన్యం**

హైదరాబాద్, ఆగస్టు 10:

అడవులను సంరక్షించుకుంటూనే అభివృద్ధి వైపు ఆదివాసీ సమాజం ముందుకు సాగాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా బంజారా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజనుల హక్కులు, భాష, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటంతో పాటు ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 202627 ఆర్థిక సంవత్సరంలో గిరిజన సంక్షేమ రంగానికి రూ.18,745.16 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

**మౌలిక వసతుల విస్తరణకు ప్రాధాన్యం**

గిరిజన ప్రాంతాల్లో విద్య, రహదారులు, తాగునీరు, విద్యుత్, సాగునీరు, వైద్యం, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి చెప్పారు. ఏ గిరిజన గ్రామం అభివృద్ధికి దూరం కాకుండా ప్రతి కుటుంబానికి అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. అభివృద్ధి ఫలాలు చివరి కుటుంబం వరకు చేరేలా ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

**గురుకులాల్లో విద్యార్థుల ప్రతిభ**

గిరిజన విద్యార్థులు విద్యారంగంలో మంచి ప్రతిభ చూపుతున్నారని లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రస్తుతం 166 గిరిజన గురుకుల విద్యాసంస్థల్లో 83 వేల మందికిపైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ స్థాయిల్లో అత్యుత్తమ ఉత్తీర్ణత శాతాలు నమోదవుతున్నాయని చెప్పారు. పలువురు విద్యార్థులు ఐఐటీలు, ఎన్ఐటీలు, నీట్‌లో సత్తా చాటారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో కృత్రిమ మేధ, డిజిటల్ విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు.

**అటవీ సంపదతో ఆదాయ వృద్ధి**

అడవులు గిరిజనుల జీవనానికి ప్రధాన ఆధారమని మంత్రి అన్నారు. ప్రకృతి వనరులను కాపాడుకుంటూనే వాటి ద్వారా ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. తేనె, చింతపండు, ఔషధ మొక్కలు వంటి అటవీ ఉత్పత్తులకు విలువ జోడించి మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గిరిజన మహిళలకు స్వయం ఉపాధి, నైపుణ్య శిక్షణ అవకాశాలను మరింత విస్తరించనున్నట్లు చెప్పారు.

**సంస్కృతి, చరిత్రకు పరిరక్షణ**

గిరిజన భాషలు, జానపద కళలు, సంప్రదాయాలు, చరిత్రను భావితరాలకు అందించడం సమాజ బాధ్యతగా మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్మిస్తున్న రాంజీగోండ్ గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం ద్వారా ఆదివాసీల పోరాట చరిత్రను భవిష్యత్ తరాలకు పరిచయం చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం గిరిజన సంక్షేమ కార్యక్రమాలను కార్యాచరణ స్థాయిలో అమలు చేస్తోందన్నారు.

కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సంతోష్ బి.ఎం., ప్రజాప్రతినిధులు, గిరిజన నాయకులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన గిరిజన ప్రముఖులు, ప్రతిభావంతులైన విద్యార్థులను సన్మానించారు. అనంతరం నిర్వహించిన గిరిజన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



# మమతా బెనర్జీ కాన్వాయ్‌పై నిరసనకారుల దాడి

- హాలిసహర్‌లో కారును చుట్టుముట్టిన ఆందోళనకారులు
- ఇటుకలు, రాళ్లు విసిరారని మమత ఆరోపణ.. ఘటనను ఖండించిన బీజేపీ
- టీఎంసీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తుండగా ఘటన
- కారుపై బురద రాసి బూట్లు, నీళ్ల సీసాలు విసిరిన నిరసనకారులు
- పోలీసుల సమక్షంలోనే దాడి జరిగిందన్న మమతా బెనర్జీ
- తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్న బీజేపీ
- పోలీసు కస్టడీలో టీఎంసీ కార్యకర్త మృతిపై కొనసాగుతున్న వివాదం

**హాలిసహర్, ఆగస్టు 10:**

పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ అధినేత్రి, మాజీ సీఎం మమతా బెనర్జీకి నిరసన సెగ తగిలింది. ఉత్తర 24 పరగణాల జిల్లా హాలిసహర్‌లో ఆమె ప్రయాణిస్తున్న కాన్వాయ్‌ను ఆందోళనకారులు అడ్డుకుని నిరసన తెలిపారు. కారుపై బురద రాయడంతో పాటు బూట్లు, నీళ్ల సీసాలు విసిరినట్లు తెలుస్తోంది. కొందరు ఇటుకలు, రాళ్లతోనూ దాడి చేశారని మమత ఆరోపించారు. ఈ ఘటనలో తన ప్రాణాలకు ముప్పు ఏర్పడేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ఘటనతో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని రాష్ట్ర బీజేపీ స్పష్టం చేసింది.

**టీఎంసీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు..**

పోలీసు కస్టడీలో టీఎంసీ కార్యకర్త బిర్జు కియోట్ మృతి చెందడంపై ఆ పార్టీ బెంగాల్‌లో ఆందోళనలు కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో కియోట్ కుటుంబాన్ని పరామర్శించేందుకు మమతా బెనర్జీ హాలిసహర్ వెళ్తుండగా నిరసన ఎదురైంది. ఆందోళనకారులు ఆమె కారును చుట్టుముట్టి నినాదాలు చేశారు. మమతను ఉద్దేశిస్తూ 'దొంగను తరిమికొట్టండి' అంటూ నినాదాలు చేసినట్లు సమాచారం. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు నిరసనకారులను వెనక్కి పంపించే ప్రయత్నం చేశారు.

**'తలకు తగిలితే ప్రాణాలు పోయేవి'**

తన కారుపై ఇటుకలు, రాళ్లు పడి ఉంటే తాను ప్రాణాలతో ఉండేదాన్ని కాదని మమతా బెనర్జీ అన్నారు. బయట నుంచి వచ్చిన సంఘవిద్రోహ శక్తులు పోలీసుల సమక్షంలోనే దాడికి పాల్పడ్డాయని ఆరోపించారు. కారు కిటికీలు మూసి ఉండకపోతే తలకు తీవ్ర గాయమై ప్రాణాలు పోయేవని పేర్కొన్నారు. ఇలాంటి దాడిని తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ చూడలేదని, తమను రక్షించేందుకు పోలీసులు తగిన చర్యలు తీసుకోలేదని ఆమె మండిపడ్డారు. పోలీసులు కేవలం బీజేపీకి రక్షణ కల్పిస్తున్నారని ఆరోపించారు. టీఎంసీ లోక్‌సభ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ, రాజ్యసభ ఎంపీ డోలా సేన్ కూడా ఘటనను తీవ్రంగా ఖండించారు.

**బీజేపీ ఖండన**

మమతా బెనర్జీ కాన్వాయ్‌పై జరిగిన దాడిని బీజేపీ పశ్చిమ బెంగాల్ అధ్యక్షుడు సామిక్ భట్టాచార్య ఖండించారు. ఈ ఘటనతో బీజేపీ కార్యకర్తలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. రాళ్లు, బురద, చెప్పులు విసరడం వంటి చర్యలను తమ పార్టీ సమర్థించదని తెలిపారు. ఇలాంటి ఘటనలు రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీస్తాయని పేర్కొంటూ బాధ్యులను గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

**కస్టడీ మరణంపై భిన్న వాదనలు**

బిర్జు కియోట్ పోలీసుల అదుపులో ఉన్న సమయంలో అనారోగ్యానికి గురై మరణించడంతో వివాదం ప్రారంభమైంది. పోలీసుల చిత్రహింసల కారణంగానే ఆయన మృతి చెందారని టీఎంసీ ఆరోపిస్తోంది. ఘటనపై స్వతంత్ర దర్యాప్తు నిర్వహించాలని కియోట్ భార్య డిమాండ్ చేస్తోంది. అయితే పోలీసుల వాదన మరోలా ఉంది. గుండెపోటు కారణంగానే బిర్జు కియోట్ మరణించినట్లు పోలీసులు స్పష్టం చేశారు. ఈ పరస్పర ఆరోపణల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ ఉద్రిక్తత కొనసాగుతోంది.

# మోదీ–జేడీ వాన్స్ ఫోన్ సంభాషణ.. వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చ

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:**

భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. భారత్–అమెరికా మధ్య కొనసాగుతున్న సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. రక్షణ, ఇంధనం, సాంకేతికత, కీలక ఖనిజాలు, సరఫరా గొలుసులు వంటి వ్యూహాత్మక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించడంపై దృష్టి సారించినట్లు సమాచారం.

**వాన్స్ దంపతులకు మోదీ అభినందనలు**

ఫోన్ సంభాషణ అనంతరం మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించారు. జేడీ వాన్స్ నుంచి ఫోన్ కాల్ అందిందని తెలిపారు. ద్వైపాక్షిక సంబంధాల్లో కీలక రంగాల్లో సహకారాన్ని మరింత లోతుగా తీసుకెళ్లే అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. ఇటీవల జేడీ వాన్స్, ఆయన భార్య ఉషా వాన్స్‌కు కుమారుడు జన్మించిన సందర్భంగా మోదీ అభినందనలు తెలిపారు. వాన్స్ కుటుంబ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

**ఎఫ్‌సీఆర్ఏ సవరణలపై అభ్యంతరాలు**

ఈ ఫోన్ సంభాషణకు ముందు భారత్‌లో విదేశీ విరాళాల నియంత్రణకు సంబంధించిన ఎఫ్‌సీఆర్ఏలో ప్రతిపాదిత మార్పులపై అమెరికా చట్టసభ్యుడు రైలీ మూర్ ఆందోళన వ్యక్తం చేశారు. స్వచ్ఛంద సంస్థలు, ట్రస్టులు, విద్యా సంస్థలు, మత సంస్థలు విదేశీ నిధులు స్వీకరించే విధానంలో మార్పులు తీసుకురావడంపై ఆయన అభ్యంతరం తెలిపారు. ఈ ప్రతిపాదనలు ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు. అయితే ఆయన చేసిన ఆరోపణలపై భారత్ వైపు నుంచి ఎలాంటి అధికారిక స్పందన వెలువడలేదు.

**రష్యా చమురుపై సుంకాల ప్రభావం**


మరోవైపు రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై అదనపు సుంకాలు విధించే అవకాశం అమెరికా తీసుకుంటున్న చర్యలతో భారత్–అమెరికా ఆర్థిక సంబంధాలు కీలక దశకు చేరాయి. రష్యా చమురు కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి కల్పించే ప్రతిపాదనకు సెనేట్ ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఈ ప్రతిపాదన చట్టంగా మారాలంటే ప్రతినిధుల సభ ఆమోదం కూడా అవసరం. రష్యా నుంచి భారీగా చమురు దిగుమతి చేసుకునే భారత్‌పై దీని ప్రభావం ఎలా ఉంటుందన్నది కీలకంగా మారింది.

**వాణిజ్య ఒప్పందంపై చర్చలు**

ఇదే సమయంలో భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్నాయి. వాణిజ్య అంశాలతో పాటు రక్షణ, ఇంధనం, ఆధునిక సాంకేతికత, కీలక ఖనిజాలు, సరఫరా గొలుసుల విషయంలో పరస్పర సహకారాన్ని పెంచుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. వాణిజ్య ఒప్పందం విషయంలో ఇరుదేశాలు పరస్పర ప్రయోజనాలను సమన్వయం చేసుకునే దిశగా చర్చలు సాగిస్తున్నాయి.

# విద్యార్థుల పోరాటానికి దిగివచ్చిన ప్రభుత్వం

- 14వ జేపీఎస్సీ పరీక్ష రద్దుకు సర్కార్ సుముఖం
- సీబీఐ దర్యాప్తుపై హామీ కోసం విద్యార్థుల పట్టుబాటు
- ఆగస్టు 10న అసెంబ్లీ ముట్టడికి విద్యార్థుల పిలుపు
- 14వ జేపీఎస్సీ పరీక్ష రద్దుకు ప్రభుత్వం ప్రతిపాదన
- అక్రమాలపై సీఐడీ, ఈడీ దర్యాప్తులకు నిర్ణయం
- 90 రోజుల్లో చార్జిషీట్ దాఖలుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ప్రతిపాదన
- సీజీఎల్ పరీక్ష రద్దు, సీబీఐ విచారణపై విద్యార్థుల డిమాండ్




**రాంచీ, ఆగస్టు 9:**

పేపర్ లీక్, పరీక్షల నిర్వహణలో అక్రమాలపై విద్యార్థులు చేపట్టిన ఉద్యమానికి జార్ఖండ్ ప్రభుత్వం స్పందించింది. 14వ జేపీఎస్సీ పరీక్షను రద్దు చేయడంతో పాటు పరీక్షల నిర్వహణలో అవకతవకలపై దర్యాప్తు, నియామక ప్రక్రియలో సంస్కరణలు చేపట్టేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. అయితే సీబీఐ దర్యాప్తుపై స్పష్టమైన హామీ ఇవ్వడంతో పాటు సీజీఎల్ పరీక్షను రద్దు చేయాల్సిందేనని విద్యార్థులు పట్టుబడుతున్నారు. ఈ డిమాండ్లపై స్పష్టత రాకపోతే ఆగస్టు 10న అసెంబ్లీ ముట్టడి చేపడతామని ప్రకటించారు.

**చర్చలు జరిగినా.. కొలిక్కిరాని వివాదం**

విద్యార్థులు, ప్రభుత్వం మధ్య ఆదివారం మరోసారి చర్చలు జరిగాయి. మూడు రోజులుగా కొనసాగుతున్న చర్చల్లో ప్రభుత్వం పలు ప్రతిపాదనలను వారి ముందుంచింది. 14వ జేపీఎస్సీ పరీక్షను రద్దు చేయడం, పరీక్షల్లో చోటుచేసుకున్నాయని ఆరోపణలు వస్తున్న అక్రమాలపై విచారణ చేపట్టడం, భవిష్యత్ నియామకాల్లో మార్పులు తీసుకురావడం వంటి అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. అయినప్పటికీ విద్యార్థులు తమ ప్రధాన డిమాండ్ల నుంచి వెనక్కి తగ్గలేదు.

**సీబీఐ విచారణకు డిమాండ్**

సీబీఐ దర్యాప్తు లేకుండా రాష్ట్ర స్థాయి సంస్థలతో విచారణ జరిపితే ప్రయోజనం ఉండదని విద్యార్థి నాయకులు స్పష్టం చేశారు. సీజీఎల్ పరీక్ష రద్దు చేయకపోవడం కూడా తమ ఆందోళనకు పరిష్కారం కాదని తేల్చిచెప్పారు. పరీక్షల నిర్వహణపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నియామక ప్రక్రియను పారదర్శకంగా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.

**సీఐడీ, ఈడీతో దర్యాప్తు**

విద్యార్థులు లేవనెత్తిన డిమాండ్లలో 99 శాతం అంశాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి సుదివ్య కుమార్ సోను తెలిపారు. 14వ జేపీఎస్సీ పరీక్షతో పాటు 2023 25 బ్యాక్‌లాగ్ నియామకాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై రెండు కోణాల్లో విచారణ చేపట్టాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. నేరపూరిత అంశాలను రాష్ట్ర సీఐడీ దర్యాప్తు చేయనుండగా.. అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలపై ఈడీ విచారణ కోరనున్నట్లు చెప్పారు.

**90 రోజుల్లో చార్జిషీట్‌కు ప్రతిపాదన**

అక్రమాలకు పాల్పడినట్లు తేలిన వారిపై వేగంగా చర్యలు తీసుకునేందుకు 90 రోజుల్లో చార్జిషీట్ దాఖలు చేసేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. భవిష్యత్ నియామక పరీక్షల నిర్వహణలో లోపాలకు తావులేకుండా నిపుణులతో కూడిన ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది.

ప్రభుత్వం పలు అంశాల్లో సానుకూలంగా స్పందించినప్పటికీ సీబీఐ దర్యాప్తు, సీజీఎల్ పరీక్ష రద్దు వంటి కీలక డిమాండ్లపై స్పష్టత రాకపోవడంతో విద్యార్థుల ఆందోళన కొనసాగుతోంది. దీంతో ఆగస్టు 10న తలపెట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంపై ఉత్కంఠ నెలకొంది.

# 'కాక్‌రోచ్ జనతా పార్టీ' జాతీయ కార్యవర్గం ప్రకటన

- యువతే కేంద్రంగా 'ప్రెజర్ గ్రూప్'గా పనిచేస్తామని వెల్లడి
- కార్యవర్గంలోని పలువురికి ఆప్‌తో గత అనుబంధాలపై విమర్శలు
- ఆగస్టు 6న జాతీయ కార్యవర్గాన్ని ఏర్పాటు చేసిన సీజేపీ
- అభిజీత్ దీప్కేకు నేషనల్ కన్వీనర్ బాధ్యతలు
- దేశవ్యాప్తంగా విస్తరణకు ప్రణాళిక
- 'క్యా బోల్తీ పబ్లిక్' కార్యక్రమంతో ప్రజల్లోకి వెళ్లే యోచన
- కీలక పదవుల్లో ఉన్న పలువురికి ఆప్‌తో గత సంబంధాలున్నాయన్న ఆరోపణలు




**ఛత్రపతి శంభాజీనగర్, ఆగస్టు 9:**

నీట్ ఉద్యమం నేపథ్యంలో వచ్చిన ప్రజాదరణను కొనసాగిస్తూ 'కాక్‌రోచ్ జనతా పార్టీ' (CJP) తన జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించింది. యువత సమస్యలు, ఆకాంక్షలకు ప్రాధాన్యం ఇస్తూ రాజకీయ పార్టీలకు భిన్నంగా 'ప్రెజర్ గ్రూప్'గా పనిచేస్తామని పార్టీ వెల్లడించింది. ఆగస్టు 6న ఏర్పాటు చేసిన కార్యవర్గంలో పలువురికి గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ (AAP)తో అనుబంధం ఉందన్న విమర్శలు తాజాగా చర్చనీయాంశంగా మారాయి. సీజేపీ ఆప్‌కు డ్యూప్లికేట్ లేదా బీటీమ్‌గా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

**రెండు రోజుల సమావేశం తర్వాత కమిటీ**

మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో అభిజీత్ దీప్కే నివాసంలో రెండు రోజులపాటు కోర్ టీమ్ సమావేశం జరిగింది. ఈ భేటీ అనంతరం జాతీయ కార్యవర్గాన్ని ఖరారు చేశారు. రాబోయే రోజుల్లో సంస్థను దేశవ్యాప్తంగా విస్తరించడంతో పాటు 'క్యా బోల్తీ పబ్లిక్' కార్యక్రమం ద్వారా ప్రజలతో నేరుగా మమేకం కావాలని పార్టీ నిర్ణయించింది.

**కీలక బాధ్యతల్లో యువత**

జాతీయ కన్వీనర్‌గా అభిజీత్ దీప్కే (30)ను నియమించారు. కోకన్వీనర్లుగా ఆశుతోష్ రంకా (30), సౌరవ్ దాస్ (27) వ్యవహరించనున్నారు. నేషనల్ ఆర్గనైజేషన్ ఇన్‌ఛార్జ్‌గా అజింక్య షిండే (35), కోఇన్‌ఛార్జ్‌గా దీపక్ బలియాన్ (26) ఎంపికయ్యారు. నేషనల్ సెక్రటరీగా ఆఫ్రీన్ నవాజ్ (34), మీడియా లీడ్‌గా విజయ్ రెడ్డి మల్లంగి (30), లీగల్ అఫైర్స్ లీడ్‌గా రత్నా సింగ్ (31), రిసెర్చ్ అండ్ పాలసీ లీడ్‌గా వైష్ణవి గౌర్ (29), టెక్నాలజీ లీడ్‌గా రోహన్ దేశ్‌పాండే (31), ఫైనాన్స్ లీడ్‌గా యోగేశ్ ఇంగ్లే (33) బాధ్యతలు చేపట్టారు.

**ఇతర నేతలపైనా ఆరోపణలు**

సీజేపీ మీడియా లీడ్, దక్షిణ జోన్ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న విజయ్ రెడ్డి మల్లంగికి ఆప్ తెలంగాణతో అనుబంధం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. ఆప్ కార్యక్రమాలు, నిధుల సేకరణ, ఎన్నికల ప్రచారాలకు సంబంధించిన ఆయన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో ఉన్నాయని విమర్శకులు పేర్కొంటున్నారు. ఫైనాన్స్ లీడ్ యోగేశ్ ఇంగ్లే పుణెలో ఆప్ కార్యకర్తగా పనిచేశారని, తూర్పు, ఈశాన్య జోన్ ఇన్‌ఛార్జ్ అంకిత్ భరద్వాజ్ గతంలో ఆప్ వాలంటీర్‌గా ఉన్నారని సమాచారం.

యువతను ప్రధాన బలంగా చేసుకుని దేశవ్యాప్తంగా విస్తరించాలన్న లక్ష్యంతో సీజేపీ కొత్త కార్యవర్గాన్ని ప్రకటించిన నేపథ్యంలో.. దాని నాయకుల గత రాజకీయ అనుబంధాలపై వస్తున్న విమర్శలు సంస్థ ముందున్న తొలి సవాలుగా మారాయి. పార్టీ తనను తాను స్వతంత్ర ప్రజా ఉద్యమ వేదికగా ఎలా నిలబెట్టుకుంటుందన్నది రాబోయే రోజుల్లో కీలకంగా మారనుంది.

**ఆప్‌తో అనుబంధాలపై చర్చ**

సీజేపీ కార్యవర్గంలోని పలువురు గతంలో ఆప్‌తో పనిచేశారన్న అంశం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. పార్టీ వ్యవస్థాపకుడు, నేషనల్ కన్వీనర్ అభిజీత్ దీప్కే 2020-23 మధ్య ఆప్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా పనిచేశారని, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆ పార్టీ డిజిటల్, సోషల్ మీడియా కార్యక్రమాల్లో భాగస్వామ్యమయ్యారని కొన్ని నివేదికలు పేర్కొంటున్నాయి. కో-కన్వీనర్ ఆశుతోష్ రంకా గతంలో ఆప్ జాతీయ అధికార ప్రతినిధిగా వ్యవహరించారని, 2025 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఆ పార్టీతో కలిసి పనిచేశారని పలు కథనాలు వెల్లడించాయి. నేషనల్ ఆర్గనైజేషన్ ఇన్‌ఛార్జ్ అజింక్య షిండే గతంలో ఆప్ మహారాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉన్నారని, ఆప్ గోవా సహ ఇన్‌ఛార్జ్‌గా కూడా పనిచేశారని సమాచారం.

# బీజేపీ ఎమ్మెల్యే అల్లుడిపై సంచలన ఆరోపణలు

- నకిలీ గుర్తింపులతో పలువురు మహిళలకు మోసం.. దాదాపు 25 పెళ్లిళ్లు చేసుకున్నాడని ఫిర్యాదు
- కుమార్తెను మోసగాడితో పెళ్లి చేశారని ఎమ్మెల్యే ఆరోపణ
- రియల్ ఎస్టేట్ వ్యాపారినంటూ అల్లుడి తండ్రి పరిచయం
- పలు రాష్ట్రాల్లో మహిళలను మోసం చేసి కోట్లాది రూపాయలు కొల్లగొట్టినట్లు ఆరోపణ
- అనుజ్ త్రివేది, ప్రకర్ త్రివేదిల అరెస్టు
- నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్





**లక్నో, ఆగస్టు 10:**

ఉత్తర్‌ప్రదేశ్‌లో బీజేపీ ఎమ్మెల్యే చేసిన ఫిర్యాదు సంచలనంగా మారింది. సెవతా నియోజకవర్గ ఎమ్మెల్యే జ్ఞాన్ తివారీ తన కుమార్తె ప్రగ్యాను మోసపూరిత వ్యవహారాలకు పాల్పడుతున్న వ్యక్తికి వివాహం చేశారని ఆరోపిస్తూ పోలీసులను ఆశ్రయించారు. తన అల్లుడు ప్రకర్ త్రివేది వేర్వేరు పేర్లు, నకిలీ గుర్తింపులను ఉపయోగించి పలువురు మహిళలను మోసం చేశాడని, దాదాపు 25 పెళ్లిళ్లు చేసుకున్నట్లు ఆరోపించారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు అనుజ్ త్రివేది, అతడి కుమారుడు ప్రకర్ త్రివేదిలను అరెస్ట్ చేశారు.

**2024లో కుమార్తె వివాహం**

ఎమ్మెల్యే ఫిర్యాదు ప్రకారం.. తన కుమార్తె ప్రగ్యాకు మిశ్రిఖ్ ప్రాంతానికి చెందిన ప్రకర్ త్రివేదితో 2024లో వివాహం జరిగింది. వివాహ సమయంలో ప్రకర్ తండ్రి అనుజ్ తాను ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారినని పరిచయం చేసుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అతడి గత నేర చరిత్ర, కేసులకు సంబంధించిన వివరాలను దాచిపెట్టారని ఆరోపించారు. పెళ్లికి ముందు త్రివేది కుటుంబం గురించి పలువురు ప్రభావవంతమైన వ్యక్తుల నుంచి సమాచారం సేకరించామని, వారు సానుకూలంగా చెప్పడంతో వివాహానికి అంగీకరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

**రెండున్నరేళ్ల తర్వాత వెలుగులోకి**

వివాహం జరిగిన రెండున్నరేళ్ల తర్వాత సోషల్ మీడియా, ఇతర మార్గాల ద్వారా ప్రకర్ త్రివేది వ్యవహారాల గురించి తమ కుటుంబానికి సమాచారం అందిందని జ్ఞాన్ తివారీ తెలిపారు. వేర్వేరు రాష్ట్రాల్లో మహిళలను నకిలీ గుర్తింపులతో పరిచయం చేసుకుని మోసం చేశాడని, వారి నుంచి కోట్లాది రూపాయలు తీసుకున్నట్లు ఆరోపించారు. అతడు దాదాపు 25 వివాహాలు చేసుకున్నట్లు కూడా ఎమ్మెల్యే తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వ్యవహారం బయటపడిన తర్వాత త్రివేది కుటుంబంతో తమ కుటుంబం అన్ని సంబంధాలను తెంచుకున్నట్లు తెలిపారు.

**కఠిన చర్యలకు డిమాండ్**

ఈ ఘటన తమ కుటుంబాన్ని తీవ్రంగా కలచివేసిందని, తన వ్యక్తిగత ప్రతిష్టకు కూడా భంగం కలిగిందని జ్ఞాన్ తివారీ పేర్కొన్నారు. మోసాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయితే నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనుజ్ త్రివేది దోషిగా తేలితే మరణశిక్ష విధించాలని, తన అల్లుడు ప్రకర్ త్రివేది కూడా నేరాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులను ఎమ్మెల్యే కోరారు. కేసుపై దర్యాప్తు కొనసాగుతోంది.





# పీర్జాదిగూడలో వైభవంగా బోనాల వేడుకలు

**బంగారు మైసమ్మ, పోచమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసిన మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి**



**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** బోనాల పండగను పురస్కరించుకుని పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధి లోని బంగారు మైసమ్మ, పోచమ్మ అమ్మవార్ల దేవాలయాలలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ పవిత్రమైన రోజున నగరంలోని అమ్మవార్ల ఆలయాల వద్ద భక్తుల సందడి కనిపిస్తోంది. పీర్జాదిగూడలోని బంగారు మైసమ్మ, పోచమ్మ ఆలయాలను పీర్జాదిగూడ నగరపాలక సంస్థ మొదటి మేయర్ జక్క వెంకట్ రెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన వారికి అర్చకులు, దేవాలయ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణల నడుమ అమ్మవారి శేషవస్త్రాలను అందించి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బోనాల పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రసిద్ధికెక్కిన ఈ వేడుకల సందర్భంగా నియోజకవర్గ, నగర ప్రజలందరిపై అమ్మవారి దివ్యమైన కరుణాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. వర్షాలు బాగా కురిసి పంటలు పండి, ప్రజలందరూ సుఖసం తోషాలతో, సకల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నట్లు వెల్లడించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వేడుకలు ప్రశాంత మైన వాతావరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జక్క వెంకట్ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# క్విట్ ఇండియా స్ఫూర్తితో సమరయోధుల కుటుంబాలను ఆదుకోవాలి

**జాతీయ కుటుంబాలుగా గుర్తించి రాయితీలు ఇవ్వాలని డిమాండ్**




ఖమ్మం, రాజముద్ర న్యూస్ : క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నాటి తెలంగాణ స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలను జాతీయ కుటుంబాలుగా గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ స్వాతంత్ర సమరయోధుల సంస్థ రాష్ట్ర అధ్యక్షులు వున్నం వెంకయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రంలో తెలంగాణ స్వాతంత్ర సమరయోధుల వారసుల సంస్థ రాష్ట్ర స్థాయి సమావేశం వెంకయ్య అధ్యక్షతన జరిగింది. జాతీయ జెండా ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా నాటి పాలకులు సమరయోధులను, వారసులను పట్టించుకోలేదన్నారు. ఉద్యమంలో పాల్గొన్న కుటుంబాలు నేడు అతికష్టంగా జీవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమరయోధులు రోజురోజుకు తరిగిపోతున్నారని, వారి త్యాగాలను గుర్తుంచుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ బి. మహేష్ కుమార్ గౌడ్ స్పందించి వారసులను సన్మానించాలని కోరారు. వారికి విద్య, వైద్యం, ఉద్యోగాల్లో రాయితీలు, ఇంటి స్థలాలు, సాగు భూములు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నా అమలు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు ఆగస్టు 15న తమ గృహాలపై జాతీయ జెండా ఎగరవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఇటీవల మహబూబాబాద్ మున్సిపల్ వార్డు కౌన్సిలర్ గా ఎన్నికైన సమరయోధురాలి వారసురాలు చీదిరాల అరుణ-జ్ఞానేశ్వర్ ను వెంకయ్య శాలువాతో సన్మానించారు. సమరయోధులు తన్నీరు వెంకటేశ్వరరావు, నూకల లింగారెడ్డి, కస్తూరి ఈశ్వరయ్య, లీగల్ అడ్వైజర్ బి. రవీంద్ర గుప్తా లను కూడా ఘనంగా సత్కరించారు. విచ్చేసిన వారసులందరికీ జాతీయ జెండాలు అందజేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రతినిధులు మల్ రెడ్డి రాజశేఖర్, సింగు రమేష్, ఏటుకూరి రామారావు, చిలుకపల్లి ముత్తిలింగం తో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి వారసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

**మంచి వైద్యం అందుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన భీమ్‌భరత్**





**చేవెళ్ళ, రాజముద్ర న్యూస్:** షాబాద్ మండలంలోని మద్దూరు గ్రామానికి చెందిన తొంట నవీన్ , షాబాద్ సావిత్రిలు అనారోగ్యంతో బాధపడుతూ...శస్త్ర చికిత్సకు వైద్య సహాయం కోసం చేవెళ్ళ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామెన భీమ్ భరత్ ను సంప్రదించగా ఆయన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇంచార్జీ దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద నవీన్ కు రూ. 1,50,000, సావిత్రికి రూ.3,50,000 మంజూరు చేశారు. సంబంధిత ప్రపోజల్ ఎల్ఓసిలు ఆదివారం రోజు వారికి వారి నివాసంలో అందజేశారు. మంచి వైద్యం అంది, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వీరితో పాటుగా మద్దూరు గ్రామ సర్పంచ్ రాజు నాయక్ , మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

## బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

**చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య**



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** చేవెళ్ల పట్టణంలో సీనియర్ నాయకులు మంగలి బాలరాజు, కౌన్సిలర్ మంగలి కళ్యాణి యాదగిరి ఆధ్వర్యంలో ఆషాఢ మాస బోనాల సందర్భంగా నిర్వహించిన తొట్టెల ఊరేగింపు కార్యక్రమాన్ని స్థానిక శాసన సభ్యులు యాదయ్య ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాస బోనాల పండుగను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## మాసాని గూడలో ఘనంగా ఆషాడ బోనాల పండుగ

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి మండల పరిధిలోని మాసాని గూడలో గ్రామ సర్పంచ్ బద్రి అర్చన ప్రభు గౌడ్ ఆధ్వర్యంలో ఆషాడ మాస బోనాల పండుగ ఆదివారం రోజు ఘనంగా నిర్వహించడం జరిగింది. గ్రామంలోని వాడవాడల నుండి మహిళలు బోనాలు ఎత్తుకొని, డప్పు చప్పులతో, పోతురాజుల విన్యాసాలతో అమ్మవారి ఆలయానికి చేరుకొని పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి, బోనాలు సమర్పించడం జరిగింది. భక్తిశ్రద్ధలతో గ్రామమంతటా పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అర్చన ప్రభు గౌడ్ మాట్లాడుతూ.... మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం ఈ ఆషాఢ మాస బోనాల పండుగ అన్నారు. గ్రామస్తులందరూ భక్తిశ్రద్ధలతో పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి, బోనాలు సమర్పించడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. పోచమ్మ తల్లి, ఎల్లమ్మ తల్లి దయ గ్రామ ప్రజలపై ఉండాలని, గ్రామస్తులందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని సర్పంచ్ అర్చన ప్రభు గౌడ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# పీర్జాదిగూడలో వైభవంగా పలహారం బండి ఊరేగింపు

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి గజమాలతో ఘన స్వాగతం
- ఊరేగింపులో పాల్గొన్న మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు, నాయకులు





**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్ :** మేడ్చల్ మల్కాజిగిరి నగరపాలక సంస్థ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్, పీర్జాదిగూడ డివిజన్‌లో బోనాల పండుగ వేడుకలు ఎంతో ఆధ్యాత్మిక ఉత్సాహంతో, కన్నులపండువగా సాగాయి. బోనాల పండుగ సంప్రదాయంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన పలహారం బండి ఊరేగింపు మహోత్సవం పీర్జాదిగూడలో భక్తులు, ప్రజాప్రతినిధులు, స్థానికుల కోలాహలం నడుమ శోభాయమానంగా జరిగింది. ఈ పవిత్రమైన ఘట్టంలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన మంత్రికి స్థానిక నాయకులు, ఆలయ నిర్వాహకులు, ప్రజలు పెద్ద గజమాలతో ఆత్మీయంగా ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా పలహారం బండి ఊరేగింపు పీర్జాదిగూడలోని ముఖ్య వీధుల గుండా ఉత్సాహపూరిత వాతావరణంలో ముందుకు సాగింది. భక్తులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి నామస్మరణలతో పరిసరాలను మార్మోగించారు. తెలంగాణ సంస్కృతిని, వైభవాన్ని ప్రతిబింబించేలా శోభాయాత్ర సాగింది. కళాకారుల నృత్యాలు, దప్పుల వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాలు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రోడ్ల ఇరువైపులా నిలబడిన ప్రజలు పలహారం బండిని, అమ్మవారి రూపాలను దర్శించుకుని భక్తిపారవశ్యంలో మునిగితేలారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బోనాల పండుగ గొప్ప నిదర్శనమని పేర్కొన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, సకల ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ ప్రాంత సమగ్ర అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లవేళలా కట్టుబడి ఉంటుందని వెల్లడించారు. భక్తిభావం, ఆధ్యాత్మిక చింతన సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని, ఇటువంటి వేడుకలు మన ఆచారాలను భవిష్యత్ తరాలకు అందిస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుర్ర శ్రీకాంత్ గౌడ్, బండారి రవీందర్, వంగూరి పరమేష్, పలువురు మాజీ కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వృద్ధురాలి హత్య కేసు ఛేదన

- ఇద్దరు నిందితుల అరెస్టు
- బంగారు ఆభరణాల కోసమే హత్య



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామంలో జులై 17వ తేదీ అర్ధరాత్రి జరిగిన వృద్ధురాలి హత్య కేసును కూసుమంచి సర్కిల్ పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. బంగారు ఆభరణాల కోసం ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.ఆదివారం ఉదయం తిరుమలాయపాలెం రోడ్డులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి మీడియా సమావేశంలో తెలిపారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి: పిండిప్రోలు గ్రామంలో చికెన్ షాప్ నిర్వహిస్తున్న ఐతనబోయిన ప్రశాంత్ (26) కు మద్యం, ఆన్లైన్ బెట్టింగ్ అలవాటు కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. తన షాప్ సమీపంలో నివసిస్తున్న వృద్ధ దంపతులను గమనిస్తూ, వృద్ధురాలు సుగుణ మెడలో బంగారు ఆభరణాలు ఉన్నాయని గుర్తించి వాటిని దోచుకోవాలని పథకం వేశాడు.జులై 17వ తేదీ అర్ధరాత్రి వృద్ధురాలి ఇంటికి వెళ్లిన ప్రశాంత్ ఆభరణాలు దోచుకునే ప్రయత్నం చేయగా ఆమె ప్రతిఘటించింది. దీంతో తన వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్డుతో ఆమెపై దాడి చేసి హత్య చేశాడు. అనంతరం ఆమె మెడలోని బంగారు చైన్, నల్లపూసల చైన్ లోని బంగారు బిళ్లలు తీసుకొని పరారయ్యాడు. హత్య తర్వాత దోచుకున్న బంగారు చైన్ ను తన వరుసకు బామ్మర్ది అయిన సరగండ్ల మహేష్ (20), బాలినిధర్మారం, మరిపెడ మండలం, మహబూబాబాద్ జిల్లా కు ఇచ్చాడు. మహేష్ ఆ చైన్ ను ఖమ్మంలోని ఒక బ్యాంక్ లో తనఖా పెట్టి రూ.1,50,000/- రుణం తీసుకున్నట్లు పోలీస్ దర్యాప్తులో వెల్లడైంది.పోలీసుల చాకచక్యం ఈ కేసు దర్యాప్తు కోసం కూసుమంచి సర్కిల్ ఇన్స్పెక్టర్ సంజీవ్ ఆధ్వర్యంలో కె. జగదీష్, పి. సంతోష్, జె. నాగరాజు, హరికృష్ణ, పి ఎస్ ఐ దివ్య తో కూడిన నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సమన్వయంతో దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, సమాచారం ఆధారంగా నిందితులను త్వరితగతి న అరెస్ట్ చేశారు.ఈ కేసులో పనిచేసిన సిబ్బంది పూర్ణచందర్ రావు, శ్రీలత, కిషన్, రాంబాబు, తొంట శ్రీనులను పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. కేసుకు సంబంధించిన మిగిలిన అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని ఏసీపీ తెలిపారు.

## ఘనంగా బోనాల వేడుకలు





**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 16, 17 వార్డు భగత్ సింగ్ నగర్ కాలనీలో నవయువ యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. కాలనీలో మల్లన్న గట్టు నుండి పోచమ్మ ఆలయం వరకు కాలనీ వాసులు బోనాలు ఎత్తారు. పోచమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. డప్పు చప్పుళ్లు, భక్తుల సందడితో ఆలయ పరిసరాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. కాలనీ ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో 16, 17వ వార్డు కౌన్సిలర్లు దేవర సమతా వెంకట్ రెడ్డి, క్రిష్ణనాయక్, నవయువ యూత్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సాయికుమార్, చాకలి రాజు, సభ్యులు, వడ్డే మల్లేష్, శేఖర్, సత్యనారాయణ, రాజశేఖర్ చారి, యువతతో పాటు కాలనీవాసులు పాల్గొని బోనాల వేడుకల్లో సందడి చేశారు.

## ట్రాలీ ఆటో ఢీకొని సుతారి మేస్త్రి మృతి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** నేలకొండపల్లి మండలం అమ్మగూడెం గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో సుతారి మేస్త్రి గండు రంగయ్య(55) అనే వ్యక్తి మరణించాడు.పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... అమ్మగూడెం గ్రామానికి చెందిన గండు రంగయ్య, మున్నూరు కాపు, వృత్తిరీత్యా సుతారి మేస్త్రి. నిన్న సాయంత్రం ఇంటి నుంచి తన టీవీఎస్ ఎక్సెల్ బండి పై వెళ్లాడు. రాత్రి సమయంలో గ్రామ శివారులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ముందు బండితో నిలబడి ఉండగా... కూసుమంచి వైపు నుండి నేలకొండపల్లి వైపు వస్తున్న ట్రాలీ ఆటోను ప్రజాపతి ప్రకాష్ అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ వెనుక నుండి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రంగయ్యకు తలకు తీవ్ర రక్త గాయాలు అయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు అతన్ని నేలకొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి కి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి కూతురు కన్నా అనూష ఫిర్యాదు మేరకు నేలకొండపల్లి ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.రంగయ్య మరణంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

## సాయిరాం కాలనీలో ఘనంగా బోనాల వేడుకలు

**శ్రీ కట్ట మైసమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించిన మహిళలు**





**హఫీజ్ పేట్, రాజముద్ర న్యూస్ :** ఆషాఢ మాస బోనాల పండుగ సందర్భంగా హఫీజ్ పేట్ సాయిరాం కాలనీలో ఆదివారం ఉత్సవ వాతావరణం నెలకొంది. కాలనీలోని శ్రీ కట్ట మైసమ్మ తల్లి ఆలయం వరకు మహిళలు సాంప్రదాయ వస్త్రధారణలో తలపై బోనాలు ఎత్తుకొని భక్తి పూర్వకంగా ఊరేగింపుగా వెళ్లారు. ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, నైవేద్యాలు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాజముద్ర తెలుగు దినపత్రిక రిపోర్టర్ కుడుకుంట్ల. పరమేష్ సాగర్ కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారి కృప, చల్లని దయ ప్రజలందరిపై ఉండాలని ఆయన కోరారు. డప్పుల చప్పుళ్లు, పోతురాజుల నృత్యాలు, భక్తి గీతాలతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. కాలనీ యువకులు భద్రతా ఏర్పాట్లు చేయగా, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాలనీ ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. వేడుకలను కాలనీ పెద్దలు, యువకులు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు.

# భవానీనగర్‌లో ఘనంగా ఆషాఢ బోనాలు

- **పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే కాలే యాదయ్య**



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు భవానీనగర్‌లో ఆషాఢ మాస బోనాల వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భవానీనగర్‌లోని పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, అమ్మవారికి బోనాలు సమర్పించిన భక్తులు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై, పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. బోనాల వేడుకల్లో మహిళలు సంప్రదాయ పద్ధతిలో బోనాలను సమర్పించి, అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆలయానికి చేరుకున్న సందర్భంగా స్థానిక నాయకులు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శంకర్ పల్లి ప్రాంత ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెగుర్త గోపాల్ రెడ్డి, శంకర్ పల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మడపతి చంద్రమౌళి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం వెంకట్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జూలకంటి శ్వేతా పాండు రంగారెడ్డి, 1వ వార్డు కౌన్సిలర్ ఎర్రోళ్ల ఆనంద్ రావు, 9వ వార్డు కౌన్సిలర్ గణేష్, భవాని నగర్ పెద్దలు బాలాచారి, లక్ష్మయ్య, నర్సింలు, నరసింహ రెడ్డి, రాజన్న కృష్ణారెడ్డి, రామచంద్రయ్య, గాజుల ప్రభాకర్, నరేందర్ గౌడ్, టీచర్లు ప్రేమ్ కుమార్, రాములు తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై బోనాల వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోచమ్మ ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఆషాఢ మాస బోనాల సందర్భంగా భవానీ నగర్‌లో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# చాట్ల నర్సయ్య విగ్రహావిష్కరణ



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** బహుముఖ ప్రజ్ఞాశాలి చాట్ల నర్సయ్య చరిత్ర పరిశోధకుడిగా కళాకారుడిగా రంగస్థల నటుడిగా కవి రచయితగా గొప్ప పేరును సంపాదించిన చాట్ల నర్సయ్య జీవితంలో ఎంత కష్టపడ్డాడని బహుముఖ ప్రజ్ఞను ప్రతి అంకంలో తెలియజేశాడని అధ్యాపకుడిగా ఎంతోమంది శిష్యులను మేటి పౌరులుగా తయారు చేశాడని సాహితీ రంగంలో ఎనలేని సేవను అందించాడని పరిశోధనలను చేసి కామారెడ్డి జిల్లాకు మంచి పేరును తీసుకువచ్చాడని చాట్ల నర్సయ్య గారి వారసులు చాట్ల నర్సయ్యను స్మరించుకుంటూ ఆయన పాలరాతి విగ్రహాన్ని పెట్టడం సముచితంగా ఉన్నదని భవిష్యత్తు తరాలకు ఈ రచయిత జ్ఞాపకం ఎల్లప్పుడూ ఉంటుందని తెలంగాణ రచయితల వేదిక సభ్యుడిగా ఆయన చేసిన సేవ ఎంతో గొప్పదని తేరవే జిల్లా అధ్యక్షులు గఫూర్ శిక్షక్ అన్నారు . ఆదివారం పోసాని పేట లో నిర్వహించిన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమము మరియు పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన అతిథిగా పాల్గొన్నారు . ఈ సందర్భంగా చాట్ల నరసయ్య చేసిన సేవలను పలువురు కొనియాడారు ఆయన సాహితీ సేవను స్మరించుకున్నారు చాట్ల నర్సయ్య ఈరోజు లేకపోవడం సాహితీ రంగానికి తీరని లోటని కవులు సాహితీవేత్తలు అభిప్రాయపడ్డారు ఈ కార్యక్రమంలో ప్రముఖ గజల్ కవి సూరారం శంకర్ డాక్టర్ జి లచ్చయ్య గంగా ప్రసాద్ పీతాంబర్ నాగభూషణం సుప్పని సత్యనారాయణ సిహెచ్ ప్రకాష్ చాట్ల నర్సయ్య గారి బంధువులు సాహితీ అభిమానులు కవులు రచయితలు పాల్గొన్నారు.

# జీవీఆర్ కరాటే అకాడమీ సరికొత్త ప్రపంచ రికార్డు

- **3 నిమిషాల 6 సెకన్లలో 80 షాబాద్ టైల్స్ ధ్వంసం**
- **9 కరాటే టెక్నిక్‌లతో రికార్డు నెలకొల్పిన కానిస్టేబుల్ వి. సుధాకర్**






హైదరాబాద్, రాజముద్ర న్యూస్: భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం డాక్టర్ జీఎస్ మేల్కోటిపార్క్ లో జరిగిన ప్రపంచ రికార్డు జీవిఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన "మిషన్-80" ప్రపంచ రికార్డు ప్రయత్నం విజయవంతంగా పూర్తైంది.జీవిఆర్ కరాటే అకాడమీకి చెందిన జాతీయ స్థాయి కరాటే క్రీడాకారుడు, మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని ఆల్వాల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ వి.సుధాకర్ తన అసాధారణ కరాటే నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ 80 షాబాద్ టైల్స్‌ను 9 విభిన్న కరాటే బాడీ టెక్నిక్స్‌తో కేవలం 3 నిమిషాల 6 సెకన్లలో బ్రేక్ చేసి సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పారు.ఈ ప్రపంచ రికార్డు ప్రయత్నాన్ని వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ పర్యవేక్షణలో నిర్వహించారు. రికార్డు ప్రయత్నాన్ని వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఇండియా చీఫ్ కో-ఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్ అధికారికంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం రికార్డు విజయవంతంగా పూర్తైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా హిమాయత్ నగర్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రమన్ గౌడ్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా "మిషన్-80"ను నిర్వహించడం ద్వారా యువతకు క్రమశిక్షణ, పట్టుదల, శారీరక దృఢత్వం దేశభక్తి సందేశాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రపంచ రికార్డు ద్వారా యువత క్రీడల వైపు అడుగులు వేస్తూ, మాదకద్రవ్యాలు ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉండి, క్రమశిక్షణతో ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని వి.సుధాకర్ కఠోర సాధనతో ఈ ప్రపంచ రికార్డును విజయవంతంగా పూర్తి చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రమన్ గౌడ్, జి విఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి ఎస్ గోపాల్ రెడ్డి, అకాడమీ బ్లాక్ బెల్ట్స్ నర్సింగరావు, కరీం,అమృతరెడ్డి, గణ సంతోషిని రెడ్డి,రాజు,అవిఘ్న వెంకటరెడ్డి, మేల్కోటిపార్క్ అధ్యక్షుడు బుషన్ రావు,భరత్వాజ్, అభిషేక్ రెడ్డి, జెష్వాల్,జెక్కీ హుసన్ ఆర్యన్ కిషన్,రఘు, నర్సింగ్ క్రికెట్ కోచ్ లు,విద్యార్థులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# ఘనంగా మాల కులస్తుల సామూహిక వనభోజనాలు





**ఖమ్మం. రాజముద్ర న్యూస్ :** బీరోలు గ్రామంలో మాల కులస్తుల ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక వనభోజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మాలకు కులస్తులు కుటుంబ సమేతంగా పాల్గొని ఆత్మీయంగా గడిపారు కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా వంటలు ఏర్పాటు చేసుకొని అందరు కలిసి సామూహికంగా భోజనాలు చేశారు అనంతరం పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుంటూ గ్రామంలో ఐక్యత సోదర భావం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఇలాంటి సాంఘిక కార్యక్రమాల ద్వారా కులస్తుల మధ్య ఐక్యత స్నేహభావం పెంపొందుతుందని తెలిపారు కార్యక్రమంలో మాల కులస్తులు పెద్దలు దామల భాస్కర్ నీరుడు యాకోబ్ చిలకపత్తిని సురేష్ ఉళ్ళు రాము గోపోజి వీరబాబు దామల్ల భాస్కర్ గుడివాడ వసంత ఉల్లూజు నాగమ్మ దామల సావిత్రి గుడివాడ సాయి పవన్ మహిళలు పెద్దలు, చిన్నారులు వనభోజన కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

# టీమిండియాకు భారీ షాక్..

- ముగ్గురు ఆల్‌రౌండర్లు ఒకేసారి అవుట్..




భారత క్రికెట్ జట్టు ప్రస్తుతం కీలక ఆటగాళ్ల వరుస గాయాల సమస్యతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది. జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణాల వంటి ప్రధాన ఆటగాళ్లు పునరావాసం (రిహాబ్) పూర్తి చేసుకుని జట్టులోకి వచ్చాక మళ్లీ గాయపడటంతో బిసిసిఐకి చెందిన 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' (CoE) పనితీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫిట్‌నెస్ పరీక్షల ప్రమాణాలు, స్పోర్ట్స్ సైన్స్ టీమ్ పనితీరు, జాతీయ సెలెక్టర్ల మధ్య సమన్వయ లోపంపై ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా, బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో వీవీఎస్ లక్ష్మణ్‌ను కలసి ఆటగాళ్ల కోలుకునే ప్రక్రియను సమీక్షించారు.

ఈ విమర్శలపై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ క్రికెట్ హెడ్ వివిఎస్ లక్ష్మణ్ స్పందిస్తూ, విమర్శలను తిరస్కరించారు. గాయాలు అనేవి ఏ క్రీడాకారుడి కెరీర్‌లోనైనా ఒక సహజమైన భాగమని ఆయన స్పష్టం చేశారు. బాధ్యులెవరో తేల్చి 'బలిపశువు' కోసం వెతకడం సరికాదని, ఎవరినీ నిందించకుండా ఆటగాళ్ల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థపైనే దృష్టి పెట్టాలని కోరారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అనేది కేవలం గాయాల నుంచి కోలుకునే స్థానం మాత్రమే కాదని, క్రీడాకారుల నైపుణ్యాలను మెరుగుపరచడంలో దీని పాత్ర చాలా పెద్దదని లక్ష్మణ్ పేర్కొన్నారు.

ప్రస్తుతం భారత్‌కు చెందిన పలువురు కీలక ఆటగాళ్లు గాయాలతో జట్టుకు దూరమయ్యారు. జస్ప్రీత్ బుమ్రా మోకాళ్ల వాపుతో బాధపడుతుండగా,సాయి సుదర్శన్ కాలిన వేలి గాయంతో, హర్షిత్ రాణా , నితీష్ కుమార్ రెడ్డి కండరాల పట్టేత (మజిల్ స్ట్రెయిన్) సమస్యతో, వాషింగ్టన్ సుందర్ తొడ కండరాల గాయంతో మైదానానికి దూరమయ్యారు. వీటితో పాటు ఆటగాళ్ల రీఎంట్రీ గడువు, ఫిట్‌నెస్ ప్రమాణాల విషయంలో సెలెక్షన్ కమిటీకి, CoE కి మధ్య విభేదాలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్ సాధించకముందే కొంతమంది నిమ్యాచ్‌లకు విడుదల చేయడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఏది ఏమైనా, నిందలు వేసుకోవడం కంటే ఆటగాళ్ల గాయాల నిర్వహణను మరింత మెరుగుపరచడమే ప్రస్తుత లక్ష్యమని లక్ష్మణ్ స్పష్టం చేశారు.

# ఆ పదాన్ని వాడితే ఊరుకునేది లేదు...

- వీవీఎస్ లక్ష్మణ్ స్ట్రాంగ్ వార్నింగ్..

**స్పోర్ట్స్ డెస్క్ :**



టీమిండియా ఆటగాళ్లు వరుసగా గాయపడటంపై వస్తున్న తీవ్ర విమర్శలపై బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (CoE) హెడ్ VVS లక్ష్మణ్ ఘాటుగా స్పందించారు. క్రీడాకారుల జీవితంలో గాయాలు సహజమైన భాగమని, ఈ విషయంలో ఎవరినీ నిందించడం లేదా బలిపశువులను చేయాలని చూడడం ఏమాత్రం సరికాదని ఆయన తేల్చి చెప్పారు. 'బ్లేమ్' (నిందించడం) అనే పదాన్ని వాడటం తమకు ఇష్టం లేదని, దీనివల్ల సమస్యలు పరిష్కారం కావని బెంగళూరులోని సిఓఈ వేదికగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. శ్రీలంకతో జరగనున్న కీలక టెస్టు సిరీస్‌కు ముందు జస్ప్రీత్ బుమ్రా, సాయి సుదర్శన్, హర్షిత్ రాణా, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్ వంటి పలువురు స్టార్ ఆటగాళ్లు గాయాల బారిన పడి సిఓఈలో పునరావాసం పొందుతున్నారు. ఆటగాళ్లను అరకొర ఫిట్‌నెస్‌తోనే మైదానంలోకి దించుతున్నారన్న విమర్శలపై లక్ష్మణ్ స్పందిస్తూ.. సీఓఈ అనేది కేవలం గాయపడిన ఆటగాళ్లకు చికిత్స అందించే 'రిహాబిలిటేషన్ సెంటర్' మాత్రమే కాదని, అంతకుమించిన బాధ్యతలతో నడుస్తున్న ఉన్నతమైన వ్యవస్థ అని వివరించారు. క్రీడాకారుల శారీరక సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు అధునాతన 'బ్రోంకో టెస్ట్' వంటి సరికొత్త పద్ధతులను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. జస్ప్రీత్ బుమ్రా, సాయి సుదర్శన్ ఎంపికలు పూర్తిస్థాయి ఫిట్‌నెస్‌కు లోబడి జరిగాయని, వైద్య బృందం పరిశీలన తర్వాతే నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. సాయి సుదర్శన్ నెట్స్‌లో బ్యాటింగ్ చేస్తున్నప్పటికీ బొటనవేలి నొప్పి పూర్తిగా తగ్గకపోవడం, బుమ్రా మోకాలి వాపు సమస్య తగ్గకపోవడంతో వైద్యులు వారి విషయంలో ముందస్తు జాగ్రత్తలు పాటిస్తున్నట్లు వివరించారు. సిఓఈ, టీమ్ మేనేజ్‌మెంట్, స్పోర్ట్స్ సైన్స్ విభాగాలు మరియు సెలక్షన్ కమిటీ మధ్య సమాచార వ్యవస్థ చాలా పారదర్శకంగా, నిరంతరం కొనసాగుతోందని చెప్పారు. సెలెక్టర్ల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని, ఆటగాళ్లను తొందరపడి మైదానంలోకి దించకుండా సుదీర్ఘ కెరీర్‌ను దృష్టిలో ఉంచుకునే నిర్ణయాలు తీసుకోబడుతున్నాయని స్పష్టం చేశారు. బీసీసీఐ కార్యదర్శి దేవజీత్ సైకియా కూడా ఇటీవల సిఓఈకి చేరుకుని పరిస్థితిని సమీక్షించిన వేళ, లక్ష్మణ్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. స్పష్టమైన డేటా ఆధారంగా, క్రీడాకారుల శ్రేయస్సే ధ్యేయంగా నిర్ణయాలు జరుగుతున్నప్పుడు ఆధారాలు లేకుండా నిందలు వేయడం సముచితం కాదని లక్ష్మణ్ ముగించారు.



## కెనడా ఓపెన్‌లో సబలెంకాకు షాక్

- కెనడా ఓపెన్‌లో సబలెంకాకు షాక్
- ప్రపంచ నంబర్‌వన్‌ను మట్టికరిపించిన 16వ సీడ్ అలెగ్జాండ్రోవా
- రెండున్నర గంటల పోరులో 7-6, 4-6, 6-4తో విజయం
- క్వార్టర్స్‌లో స్వితోలినాతో తలపడనున్న రష్యా క్రీడాకారిణి
- యూఎస్ ఓపెన్ టైటిల్ రక్షణకు ముందు సబలెంకాకు ఎదురుదెబ్బ

**మాంట్రియల్, ఆగస్టు 9**

కెనడా ఓపెన్‌లో సంచలనం నమోదైంది. ప్రపంచ నంబర్‌వన్, నాలుగు సార్లు గ్రాండ్‌స్లామ్ విజేత ఆర్యనా సబలెంకా టోర్నీ నుంచి నిష్క్రమించింది. నాలుగో రౌండ్‌లో 16వ సీడ్ ఎకతెరీనా అలెగ్జాండ్రోవా 76(3), 46, 64తో సబలెంకాపై విజయం సాధించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. దాదాపు రెండున్నర గంటలపాటు సాగిన పోరులో కీలక సమయాల్లో సబలెంకా చేసిన తప్పిదాలు ఆమె ఓటమికి కారణమయ్యాయి.

**టైబ్రేక్‌లో తొలి దెబ్బ**

మ్యాచ్ ఆరంభంలో సబలెంకా సర్వీస్ బ్రేక్ చేసి ఆధిక్యంలోకి వెళ్లినా.. అలెగ్జాండ్రోవా వెంటనే పుంజుకుంది. ఇరువురూ హోరాహోరీగా పోరాడటంతో తొలి సెట్ టైబ్రేక్‌కు చేరింది. అక్కడ రష్యా క్రీడాకారిణి 73తో పైచేయి సాధించి సెట్‌ను కైవసం చేసుకుంది. దీంతో సబలెంకాపై ప్రారంభంలోనే ఒత్తిడి పెరిగింది.

**రెండో సెట్‌లో నంబర్‌వన్ పుంజుకుంది**

రెండో సెట్‌లో సబలెంకా తన అనుభవాన్ని ఉపయోగించి తిరిగి పోటీలోకి వచ్చింది. 43తో ఆధిక్యంలో ఉన్న సమయంలో అలెగ్జాండ్రోవా సర్వీస్‌ను బ్రేక్ చేసిన ఆమె.. ఆ తర్వాత తన సర్వీస్‌ను కాపాడుకుంది. దీంతో రెండో సెట్‌ను 64తో గెలుచుకుని మ్యాచ్‌ను నిర్ణాయక మూడో సెట్‌కు తీసుకెళ్లింది.

**చివర్లో తప్పిదాలతో మ్యాచ్ చేజార్చుకుంది**

మూడో సెట్‌లో అలెగ్జాండ్రోవా దూకుడైన షాట్లతో ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచింది. అదే సమయంలో సబలెంకా నుంచి అనవసర తప్పిదాలు పెరిగాయి. 45తో వెనుకబడిన దశలో మ్యాచ్‌లో నిలవాలంటే సర్వీస్‌ను తప్పనిసరిగా నిలబెట్టుకోవాల్సి వచ్చింది. ఆ గేమ్‌లో రెండు మ్యాచ్ పాయింట్లను కాపాడుకున్న సబలెంకా.. మూడో మ్యాచ్ పాయింట్ వద్ద డబుల్ ఫాల్ట్ చేయడంతో విజయం అలెగ్జాండ్రోవా సొంతమైంది.

**క్వార్టర్స్‌లో స్వితోలినా సవాల్**

క్వార్టర్ ఫైనల్లో అలెగ్జాండ్రోవాకు ఉక్రెయిన్ స్టార్ ఎలినా స్వితోలినా ఎదురుకానుంది. నాలుగో రౌండ్‌లో స్వితోలినా అమెరికా ఎనిమిదో సీడ్ అమాండా అనిసిమోవాను 62, 64తో ఓడించి క్వార్టర్ ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది. గత ఏడాది యూఎస్ ఓపెన్ టైటిల్ గెలిచిన సబలెంకాకు ఈ ఓటమి.. తన టైటిల్ రక్షణకు సన్నద్ధమవుతున్న సమయంలో గట్టి ఎదురుదెబ్బగా మారింది.

## హెల్మెట్ పగిలేలా బంతి విసురుతా...

### వైభవ్ సూర్యవంశీకి షాకింగ్ ఛాలెంజ్..

**స్పోర్ట్స్ డెస్క్ :**



భారత యువ క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీపై ఆస్ట్రేలియా మాజీ వేగవంతమైన బౌలర్ బ్రెట్ లీ ప్రశంసల వర్షం కురిపించారు. ఐపీఎల్‌లో జస్ప్రీత్ బుమ్రా, జోష్ హేజిల్‌వుడ్ వంటి అగ్రశ్రేణి బౌలర్లను సైతం ఎదుర్కొని సిక్సర్లతో విరుచుకుపడిన సూర్యవంశీ, తన అద్భుతమైన హిట్టింగ్ నైపుణ్యాలతో అందరి దృష్టినీ ఆకర్షించారు. ఇటీవల ఇంగ్లాండ్ పర్యటనలో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన సమయంలో షార్ట్ పిచ్ బంతులను ఎదుర్కోవడంలో కాస్త తడబడినప్పటికీ, ఆ తర్వాత జింబాబ్వే పర్యటనలో పుంజుకుని మూడు మ్యాచుల్లో 151 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచారు. ఈ క్రమంలో సూర్యవంశీ ఆటతీరుపై మాట్లాడిన బ్రెట్ లీ, ఒకవేళ తాను అతనికి బౌలింగ్ చేయాల్సి వస్తే ఎలాంటి వ్యూహం ఉపయోగిస్తానో వివరించారు. బ్యాటర్లు షార్ట్ పిచ్ బంతులను బౌండరీకి తరలించే క్రమంలో సవాలును స్వీకరించడం తనకు ఇష్టమని చెబుతూ, సూర్యవంశీకి వేగవంతమైన షార్ట్ పిచ్ బంతిని, హెల్మెట్ ఎత్తులో విసిరి అతని సామర్థ్యాన్ని పరీక్షించేవాడినని అన్నారు. ఒకవేళ ఆ బంతికి సూర్యవంశీ సిక్స్ కొట్టినప్పటికీ, వెనకడుగు వేయకుండా మళ్లీ అదే తరహా బంతిని విసరడానికి తాను అస్సలు సంకోచించనని పేర్కొన్నారు.

సూర్యవంశీ వయస్సుపై వస్తున్న పలు వివాదాలు లేదా చర్చల గురించి బ్రెట్ లీ స్పందిస్తూ, అతని వయస్సు 15 ఏళ్లా లేక 1718 ఏళ్లా అనే దానితో సంబంధం లేదని తేల్చి చెప్పారు. చిన్న వయసులోనే అతను చూపుతున్న బ్యాటింగ్ ప్రతిభ అసాధారణమైనదని, భారత క్రికెట్‌కు లభించిన ఒక గొప్ప ఆవిష్కరణ అని ప్రశంసించారు. వయసు గురించి వచ్చే మాటలను పట్టించుకోకుండా ఆటపైనే దృష్టి పెడితే, రాబోయే రోజుల్లో సూర్యవంశీ అంతర్జాతీయ స్థాయిలో మరెన్నో గొప్ప విజయాలు సాధిస్తాడని బ్రెట్ లీ ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆఖర్లో సిరాజ్ హ్యాట్రిక్ సిక్సర్లు..
## వార్మప్ మ్యాచ్‌లో భారత్ విజయం

**స్పోర్ట్స్ డెస్క్ :**



శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్‌కు ముందు టీమ్‌ఇండియా ప్లేయర్లకు మంచి ప్రాక్టీస్ లభించింది. శ్రీలంక ఎలెవన్‌తో జరిగిన మూడు రోజుల వార్మప్ మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మూడోరోజు లంక జట్టు రెండో ఇన్నింగ్స్‌ను 200/6 వద్ద డిక్లేర్ చేసి భారత్‌కు 206 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ టార్గెట్‌ని టీమ్‌ఇండియా 44.3 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఆట ఆఖరి ఓవర్లో భారత్ విజయానికి 16 పరుగులు అవసరంగా కాగా.. సిరాజ్ (32*; 15 బంతుల్లో) వరుసగా మూడు సిక్సర్లు బాది జట్టుకు విజయాన్ని అందించాడు. తొలి ఇన్నింగ్స్‌లో డకౌటైన యశస్వి జైస్వాల్ (61 రిటైర్డ్ హర్ట్; 46 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఈసారి అర్ధ శతకంతో మెరిశాడు. టీమ్‌ఇండియాకు ఊరటనిచ్చే విషయం ఏంటంటే.. చేతి వేలికి గాయం కారణంగా తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగని కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేశాడు. క్రీజులో సౌకర్యవంతంగా కనిపించిన గిల్ (44; 54 బంతుల్లో 7 ఫోర్లు) చక్కటి షాట్లు ఆడాడు. రిషభ్ పంత్ (28), రవీంద్ర జడేజా (22 రిటైర్డ్ హర్ట్), ధ్రువ్ జురెల్ (17) పరుగులు చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక ఎలెవన్ 363/8 చేయగా, టీమ్‌ఇండియా 357/6 వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే.



## ఒకే మ్యాచ్‌లో 8 వికెట్లు పడగొట్టిన 22 ఏళ్ల యువ సంచలనం


**స్పోర్ట్స్ డెస్క్ :**



క్రికెట్ ప్రపంచంలోకి ఒకే ఒక్క స్పెల్‌తో తుఫానులా దూసుకొచ్చాడు ఆస్ట్రేలియాకు చెందిన 22 ఏళ్ల యువ సంచలనం క్యాంప్‌బెల్ థామ్సన్. బంగ్లాదేశ్‌తో జరిగిన మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌లో తన ధాటి ఏంటో నిరూపించుకుంటూ ప్రత్యర్థి బ్యాటర్లకు కలలో కూడా భయం పుట్టించేలా బౌలింగ్ చేశాడు. టెస్టు సిరీస్ ఆడేందుకు వచ్చిన అంతర్జాతీయ స్థాయి జట్టు బంగ్లాదేశ్‌ను తన పదునైన బౌలింగ్ నైపుణ్యంతో ఒక్కడిగానే కోలుకోలేని దెబ్బతీశాడు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఒక వికెట్‌తో సరిపెట్టుకున్న థామ్సన్, రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం పూర్తి భిన్నమైన రూపం ఎత్తాడు. మైదానంలో నిప్పులు చెరిగే బంతులతో విరుచుకుపడుతూ బంగ్లాదేశ్ బ్యాటింగ్ ఆర్డర్‌ను కకలావికలం చేశాడు. పకడ్బందీ లెంగ్త్, వేగంతో బంగ్లా బ్యాటర్లను వరుసగా పెవిలియన్ దారి పట్టించాడు. ఈ యువ బౌలర్ ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన మెహెదీ హసన్ మిరాజ్ సహా బంగ్లాదేశ్ స్టార్ బ్యాటర్లందరూ చేతులెత్తేశారు. కేవలం 54 పరుగులకే బంగ్లాదేశ్ ఆల్‌అవుట్ కాగా, అందులో ఏకంగా 8 వికెట్లను క్యాంప్‌బెల్ థామ్సన్ ఒక్కడే తన ఖాతాలో వేసుకోవడం అతని ఆధిపత్యానికి నిదర్శనం. ఆ జట్టులోని 10 మంది బ్యాటర్లు ఒంటిసంఖ్యకే పరిమితమవ్వడానికి థామ్సన్ చూపించిన బౌలింగ్ మేజిక్కే కారణం. అంతర్జాతీయ అనుభవం ఉన్న జట్టును తన పేస్ ధాటితో ఇన్నింగ్స్ 38 పరుగుల తేడాతో ఓడించడంలో కీలక పాత్ర పోషించిన థామ్సన్, ఇప్పుడు ఆస్ట్రేలియా క్రికెట్‌లో అత్యంత ఆసక్తికరమైన కొత్త సంచలనంగా మారాడు.

ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్, తొలి ఇన్నింగ్స్‌లో 263 పరుగులు చేసింది. ఆల్‌రౌండర్ మెహెదీ హసన్ మిరాజ్ అద్భుత శతకంతో జట్టును ఆదుకున్నాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన క్రికెట్ ఆస్ట్రేలియా ఎలెవన్ 355 పరుగులు చేసి, ఏకంగా 92 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. ఆసీస్ యువ బ్యాటర్ టీగ్ విల్లీ 130 పరుగులతో విరుచుకుపడగా, జేక్ డోరన్ 76 పరుగులతో సత్తా చాటాడు. అయితే అసలు డ్రామా బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లోనే మొదలైంది. రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన బంగ్లాదేశ్ బ్యాటర్లకు ఆసీస్ 22 ఏళ్ల యువ బౌలర్ క్యాంప్‌బెల్ థామ్సన్ చుక్కలు చూపించాడు. అతని దాటికి బంగ్లాదేశ్ టీమ్ కేవలం 54 పరుగులకే కుప్పకూలిపోయింది. తొలి ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ తీసిన థామ్సన్, రెండో ఇన్నింగ్స్‌లో ఏకంగా 8 వికెట్లు నేలకూల్చి బంగ్లా వెన్ను విరిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన మెహెదీ హసన్ మిరాజ్ కూడా రెండో ఇన్నింగ్స్‌లో కనీసం రెండంకెల స్కోరు కూడా చేయలేకపోయాడు. మొత్తం బంగ్లాదేశ్ ఇన్నింగ్స్‌లో 10 మంది బ్యాటర్లు ఒంటిసంఖ్య (సింగిల్ డిజిట్) స్కోరుకే పరిమితం కాగా, కేవలం ఓపెనర్ తాంజిద్ హసన్ మాత్రమే 22 పరుగులతో రెండంకెల స్కోరును దాటగలిగాడు. అతడు మినహా మిగిలిన వారిలో ఎవరూ 6 పరుగుల కంటే ఎక్కువ చేయలేకపోయారు. అంతేకాదు, ముగ్గురు బ్యాటర్లు పరుగుల ఖాతా తెరవకుండానే పెవిలియన్ బాట పట్టారు. దీంతో క్రికెట్ ఆస్ట్రేలియా ఎలెవన్ ఇన్నింగ్స్ 38 పరుగుల తేడాతో ఘోర విజయాన్ని నమోదు చేసింది. ఈ దారుణ ప్రదర్శనతో టెస్టు సిరీస్ ప్రారంభానికి ముందే బంగ్లాదేశ్ డ్రెస్సింగ్ రూమ్‌లో తీవ్ర ఆందోళన నెలకొంది.

## చరిత్ర సృష్టించిన భారత అథ్లెట్లు



**స్పోర్ట్స్, డెస్క్ :**

వరల్డ్ అథ్లెటిక్స్ అండర్ 20 ఛాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్లు అద్భుతమైన ప్రదర్శన చేశారు. శనివారం జావెలిన్ త్రో ఈవెంట్‌లో ఆశిశ్ యాదవ్ రజతం సొంతం చేసుకోగా.. తాజాగా మరో రెండు పతకాలు భారత్ ఖాతాలో చేరాయి. పురుషుల హైజంప్ విభాగంలో బసంత్ కుమార్ మేఘ్వాల్ రజత పతకంతో మెరిశాడు. తద్వారా వరల్డ్ అండర్20 ఛాంపియన్‌షిప్ చరిత్రలోనే పురుషుల హైజంప్‌లో భారత్‌కు పతకం అందించిన తొలి అథ్లెట్‌గా బసంత్ రికార్డు లెక్కాడు. కాగా ఈ పోటోలో అల్జీరియాకు చెందిన యూనిస్ అయాచి, బసంత్ కుమార్, బ్రిటన్ అథ్లెట్ ఓటిస్ పూల్ ముగ్గురూ కూడా ఒకే హైట్ (2.21 మీటర్లు) జంప్ చేశారు. కానీ ఈ హైట్‌ను అయాచి మొదటి ప్రయత్నంలోనే జంప్ చేయడంతో అతడికి స్వర్ణ పతకం దక్కింది. ఈ ఎత్తును బసంత్ రెండవ ప్రయత్నంలో జంప్ చేయడంతో రజత పతకం గెలుచుకున్నాడు. మూడో ప్రయత్నంలోనే ఎగిరిన ఓటిస్ పూల్ కాంస్య పతకానికే పరిమితమయ్యాడు. మరోవైపు లాంగ్ జంప్‌లో షానవాజ్ ఖాన్ 7.84 మీ. దూకి కాంస్య పతకం సాధించాడు. అండర్20 ఛాంపియన్‌షిప్స్ లాంగ్‌జంప్‌లో కూడా భారత్‌కు ఇదే తొలి పతకం కావడం గమనార్హం.

## కొరియా మాస్టర్స్ ఛాంపియన్ అశ్మిత

**స్పోర్ట్స్, డెస్క్ :**



కొరియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత యువ షట్లర్ అశ్మిత చాలిహా అదరగొట్టింది. ఈ టోర్నీ మహిళల సింగిల్స్ విజేతగా అశ్మిత నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ పోరులో చైనాకు చెందిన హాన్ ఖియాన్‌క్సీపై 1421, 2114, 2114 తేడాతో విజయం సాధించిన అశ్మిత.. తన తొలి బీడబ్ల్యూఎఫ్ టూర్ టైటిల్‌ను ముద్దాడింది. 53 నిమిషాల పాటు సాగిన ఈ హోరాహోరీ పోరులో అస్సాంకు చెందిన అశ్మిత .. తొలి గేమ్‌లోకాస్త తడబడింది. తొలి గేమ్‌ను చైనా షట్లర్ హాన్ 1421తో సొంతం చేసుకుంది. అనంతరం రెండో గేమ్‌లో అశ్మిత అద్భుతమైన కమ్‌బ్యాక్ ఇచ్చింది. అటాకింగ్ గేమ్‌తో విరుచుకుపడి హాన్‌ను ఒత్తిడిలోకి నెట్టింది. ఈ అస్సాం షట్లర్ సంచలన ప్రదర్శనతో రెండో గేమ్‌ను 2114తో కైవసం చేసుకుని మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లింది. మూడో గేమ్‌లో కూడా ఆమె సత్తాచాటింది. ఒక దశలో 911తో వెనకబడినప్పటికీ అశ్మిత ఏమాత్రం ఒత్తిడికి లోనుకాలేదు. కీలక సమయంలో తిరిగి పుంజుకుని ప్రత్యర్థిపై 2114తో తేడాతో విజయం సాధించింది. గేమ్‌తో పాటు మ్యాచ్‌ను కూడా ఆమె గెలుచుకుంది.



# నిజమైన విజయం లభించింది

- రవి నంబూరి, శ్రీ గౌరిప్రియ, కిరణ్ అబ్బవరం, ఎస్‌కేఎన్, ధీరజ్

''ఒక సినిమాకు పని చేసిన ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండటమే నిజమైన విజయం. ఆ సక్సెస్ మా 'చెన్నై లవ్‌స్టోరీ'కి లభించింది'' అని కిరణ్ అబ్బవరం అన్నారు. కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరిప్రియ జంటగా నటించిన సినిమా 'చెన్నై లవ్ స్టోరీ'. సాయి రాజేశ్ కథతో రవి నంబూరి ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఎస్‌కేఎన్, సాయి రాజేశ్ నిర్మించిన ఈ సినిమా జూలై 24న విడుదలైంది. ఈ చిత్రం రూ. 50 కోట్ల వసూళ్లు సాధించిందని యూనిట్ పేర్కొంది. శనివారం యూనిట్ నిర్వహించిన రూ. 50 కోట్ల బ్లాక్ బస్టర్ సెలబ్రేషన్‌లో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ– ''మా 'చెన్నై లవ్‌స్టోరీ' ప్రేమకథా చిత్రం కాబట్టి ఫ్యామిలీ ఆడియన్స్ వస్తారా? అనే సందేహం కలిగింది. ఇటీవల మేం థియేటర్స్ విజిట్ చేశాం. ప్రతి థియేటర్‌లో ఎక్కువ సంఖ్యలో ఫ్యామిలీ ఆడియన్స్ ఉంటున్నారు'' అన్నారు. ''ఒక సినిమాను ఎలా ప్రమోట్ చేయాలో ఈ సినిమా ప్రయాణంలో మా నిర్మాతల నుంచి నేర్చుకున్నాను'' అని తెలిపారు రవి నంబూరి.

''కంటెంట్ బాగుంటే విజయాన్ని అందించడంలో తెలుగు ప్రేక్షకులు ముందుంటారని మా సినిమాతో మరోసారి నిరూపితమైంది'' అని చె□పారు శ్రీగౌరి ప్రియ.''మా సినిమాకి ఘనవిజయాన్ని అందించిన ప్రేక్షకులకు థ్యాంక్స్'' అని అన్నారు సహ–నిర్మాత ధీరజ్ మొగిలినేని. ''8 రోజుల్లోనే కిరణ్ గారి కెరీర్‌లో ఈ సినిమా బిగ్గెస్ట్ హిట్‌గా నిలవడం హ్యాపీగా ఉంది'' అని చె□పారు ఎస్‌కేఎన్.



# నా క్లిప్పింగ్స్‌తో యువతను తప్పుదోవ పట్టించొద్దు: కంగనా రనౌత్

నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్ ట్రోలర్స్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తన సినిమాల్లోని సన్నివేశాలను చూపిస్తూ విమర్శలు చేస్తోన్న వారికి గట్టి కౌంటర్ ఇచ్చారు. దయచేసి యువతను తప్పుదోవ పట్టించొద్దని హితవు పలికారు. ఇటీవల యువతను ఉద్దేశించి కంగనా వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. కొందరు హిందూ యువతులు బాధ్యత లేకుండా.. స్వేచ్ఛ పేరిట తిరుగుతున్నారని ఆమె విమర్శించారు. వారిని 'గట్టర్ జనరేషన్' అని వ్యాఖ్యానించారు. దీనిపై సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేగింది. దీంతో కొందరు నెటిజన్లు కంగనా వ్యాఖ్యలను తప్పుబడుతూ.. ఆమె సినిమాల్లోని కొన్ని పాత్రలను, పాత వీడియోలను వైరల్ చేశారు.

ఈ ట్రోలింగ్‌పై కంగనా ఇన్‌స్టాలో స్పందించారు. సినిమాల్లో తాను పోషించిన పాత్రలకు, నిజ జీవితానికి ముడిపెట్టొద్దని కోరారు. ''నేను రూ.కోట్లు పారితోషికం తీసుకుని సినిమాల్లో ఆయా పాత్రలు పోషిస్తాను. పెద్ద పెద్ద ఈవెంట్లలో పాల్గొన్నప్పుడు నా చుట్టూ భారీ భద్రత ఉంటుంది. అలాంటి వాటిని ఉదాహరణగా చూపిస్తూ.. పబ్‌లలో, రోడ్ల మీద, ఫంక్షన్లలో కూడా యువత అలాగే ప్రవర్తించొచ్చని అంటారా? ఈ రెండూ ఒకటేనా?. నటిగా నా వృత్తికి తగ్గట్లుగా విభిన్న పాత్రలు పోషిస్తాను. ఈ విషయంలో నేను సిగ్గుపడాల్సింది ఏమీ లేదు. దయచేసి యువతను తప్పుదోవ పట్టించకండి. ఇవాళ ఇతరుల పిల్లలను మీరు తప్పుదోవ పట్టిస్తే.. రేపు ఆ పరిస్థితి మీ పిల్లలకూ రావచ్చు'' అని కంగనా హెచ్చరించారు.




# అరుదైన మైలురాయిని చేరుకున్న 'రామాయణ'.. ఇది అసలైన బీభత్సమంటే

బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతగా, యశ్ రావణుడిగా నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణ'. ఈ సినిమా ప్రకటించిన నాటి నుంచే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల మేకర్స్ విడుదల చేసిన ట్రైలర్‌కు అన్ని భాషల్లోనూ విశేష స్పందన లభిస్తోంది. తాజాగా చిత్ర బృందం వెల్లడించిన వివరాల ప్రకారం, 'రామాయణ' ట్రైలర్ అన్ని భాషల్లో కలిపి 350 మిలియన్ల వ్యూస్ దాటింది. దీంతో విడుదలకు ముందే ఈ చిత్రం అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ప్రస్తుతం ఈ ట్రైలర్ యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో కొనసాగుతోంది. నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ చిత్రాన్ని నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో రూపొందుతున్న ఈ సినిమాకు డీఎన్ఈజీ (DNEG) విజువల్ ఎఫెక్ట్స్ అందిస్తుండగా, ఏ.ఆర్. రెహమాన్, హన్స్ జిమ్మర్ సంగీతం సమకూరుస్తున్నారు. సన్నీ డియోల్, రవి దూబే, అరుణ్ గోవిల్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'రామాయణ' పార్ట్1ను 2026 దీపావళికి, పార్ట్2ను 2027 దీపావళికి విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించింది. ట్రైలర్‌కు లభిస్తున్న అద్భుత స్పందనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.



# 'టాక్సిక్‌లో బోల్డ్ రోల్.. అందుకే ఒప్పుకున్నా'

యశ్ హీరోగా వస్తోన్న లేటెస్ట్ యాక్షన్ మూవీ టాక్సిక్.. ఇప్పటికే రిలీజ్ కావాల్సిన ఈ చిత్రం పలుసార్లు వాయిదా పడింది. ఎట్టకేలకు ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుందని మేకర్స్ ప్రకటించారు. ఈ మూవీకి గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో యశ్ సరసన బాలీవుడ్ భామ కియారా అద్వానీ హీరోయిన్‌గా కనిపించనుంది. ఇప్పటికే రిలీజైన టీజర్, సాంగ్స్‌పై పెద్దఎత్తున విమర్శలొచ్చాయి. మరీ బోల్డ్‌గా సీన్స్ ఉన్నాయంటూ పలువురు విమర్శించారు.

తమ సినిమాపై విమర్శల వస్తోన్న నేపథ్యంలో తన రోల్‌పై హీరోయిన్ కియారా అద్వానీ స్పందించింది. తన పాత్రకు సంబంధించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. ఈ కథ వినగానే ఆ పాత్రకు కనెక్ట్ అయ్యానని తెలిపింది. మహిళలను కేవలం మూసధోరణి పాత్రలే కాకుండా బలంగా, మరింత సహజంగా ఉండాలని పేర్కొంది. అలాంటి అవకాశం ఈ పాత్రలో ఉన్నందుకే వెంటనే ఓకే చెప్పానని కియారా వెల్లడించింది.

ఇలాంటి పాత్ర చేయడం ప్రతి నటికీ ఓ కల అని అన్నారు. నా కెరీర్‌లో ఇలాంటి క్లిష్టమైన పాత్రను పోషించగలననే ధైర్యం కలిగిందని తెలిపారు. నయనతార, హుమా ఖురేషీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్‌లతో కలిసి పనిచేయడం నాకు చాలా కొత్త అనుభూతిని ఇచ్చిందన్నారు. ఇంతమంది ఒకే సినిమాలో కనిపించడం ప్రేక్షకులకు నచ్చుతుందని పేర్కొన్నారు. ఈ సినిమాపై నాకు ఇష్టం కలగడానికి ఇలాంటి క్షణాలే కారణమని వెల్లడించారు.

# ఓటీటీలోకి రాబోతున్న లెనిన్..

అక్కినేని అఖిల్ కెరీర్‌లోనే మొట్టమొదటి బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన భారీ ప్రాజెక్ట్ 'లెనిన్'. భారీ అంచనాల నడుమ జూలై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా, మొదటి షో నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి కలెక్షన్ల వర్షం కురిపిస్తూ నిర్మాతలకు లాభాలను తెచ్చిపెట్టింది. ఈ రూరల్ యాక్షన్ డ్రామాలో అఖిల్ సరసన యంగ్ అండ్ గ్లామరస్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించగా, దర్శకుడు మురళీ కిశోర్ అబ్బూరు ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కించారు. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై అక్కినేని నాగార్జున, నాగవంశీ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం, థియేటర్లలో ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.100 కోట్ల కలెక్షన్లను రాబట్టి అఖిల్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. అఖిల్ సరికొత్త మాస్ లుక్, మాస్ ఎలిమెంట్స్, పవర్‌ఫుల్ యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. థియేటర్లలో సంచలన విజయం సాధించి రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన ఈ మాస్ యాక్షన్ డ్రామా, ఇప్పుడు ఓటీటీ ప్రియులను అలరించేందుకు సిద్ధమైంది. ఈ సినిమాకు సంబంధించిన డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 దక్కించుకుంది. ఈ క్రమంలోనే 'లెనిన్' చిత్రాన్ని రాబోయే ఆగస్టు 7వ తేదీ నుంచి తమ ప్లాట్‌ఫామ్‌లో డిజిటల్ స్ట్రీమింగ్‌కు తీసుకురాబోతున్నట్లు ఒక స్పెషల్ ప్రోమో వీడియో ద్వారా మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. ఈ పోస్ట్‌కు గర్జన మొదలవుతోంది.ప్రేమ, ప్రతీకారం, విప్లవాల కథ మీ తెరలను అలరించడానికి సిద్ధంగా ఉంది. లెనిన్ ఆగస్టు 7న, ప్రత్యేకంగా తెలుగు జీ5లో ప్రసారం కానుంది'' అని రాసుకొచ్చారు. థియేటర్లలో మిస్ అయినవారు, మళ్లీ చూడాలనుకునేవారు జీ5లో ఈ బ్లాక్‌బస్టర్ హిట్ సినిమాను చూడొచ్చు.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com